


దగా స్థానంలో నిఘా వేసే జాతీయ దిన పత్రిక

# నీలగిరి శంఖారావమ్

సమగ్ర సమాచార దర్శిని    తెలుగు జాతీయ దినపత్రిక

నల్లగొండ    సంపుటి :05    సంచిక :119  ఎడిటర్ : కోటగిరి చంద్రశేఖర్  మంగళవారం 25-08-2026    పేజీలు : 4    వెల : రూ. 3/-

## సెక్రటేరియట్‌లో సోలార్ కార్ పార్కింగ్.. డిసెంబరులోగా పూర్తి చేయాలని మంత్రి ఆదేశం



హైదరాబాద్, ఆగస్టు 24,తెలంగాణ సెక్రటేరియట్‌లో రూ.26.81 కోట్ల అంచనా వ్యయంతో చేపడుతున్న సోలార్ కార్ పార్కింగ్ వ్యవస్థ పనులను డిసెంబరు నాటికి పూర్తి చేయాలని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. ఉత్తర భాగంలో రెండు, దక్షిణంలో మూడు, పశ్చిమంలో ఒక వరుసగా సోలార్ ప్యానెళ్లతో షెడ్లు ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. ఈ వ్యవస్థ ద్వారా సుమారు 90 వేల యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి చేసి, సెక్రటేరియట్ నెలవారీ విద్యుత్ బిల్లులో 16 శాతం వరకు ఆదా చేయవచ్చుని మంత్రి తెలిపారు. నార్కెట్‌పల్లి వంతెన పనులను కూడా వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు.తెలంగాణ సెక్రటేరియట్‌లో విద్యుత్ ఆదాతో పాటు పర్యావరణహిత మౌలిక వసతులను పెంచే దిశగా సర్కార్ మరో కీలక నిర్ణయం తీసుకుంది. రూ.26.81 కోట్ల అంచనా వ్యయంతో చేపడుతున్న సోలార్ కార్ పార్కింగ్ వ్యవస్థ ఏర్పాటు చేయనుండగా.. ఈ పనులను ఈ ఏడాది డిసెంబరు నాటికి పూర్తి చేయాలని రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. సెక్రటేరియట్ ప్రాంగణంలోని కార్ పార్కింగ్ ప్రాంతాల్లో సోలార్ ప్యానెళ్లతో కూడిన షెడ్లను ఏర్పాటు చేయడం ద్వారా ఒకేసారి వాహనాల పార్కింగ్, విద్యుత్ ఉత్పత్తి జరిగేలా ఈ వ్యవస్థను రూపొందిస్తున్నారు. సెక్రటేరియట్‌లో శనివారం ఆర్అండ్‌బీ ఉన్నతాధికారులతో మంత్రి కోమటిరెడ్డి సమీక్ష నిర్వహించారు. సోలార్ కారు పార్కింగ్, సీఆర్ఐఎఫ్ పనులు, వివిధ వంతెనల నిర్మాణ పురోగతిపై అధికారులతో చర్చించారు. సోలార్ పార్కింగ్ ప్రాజెక్టు నిర్దేశిత గడువులోగా పూర్తయ్యేలా పనుల వేగాన్ని పెంచాలని సూచించారు. నిర్మాణంలో నాణ్యత విషయంలో రాజీ పడకుండా, సమన్వయంతో ముందుకు వెళ్లాలని అధికారులను ఆదేశించారు. సోలార్ పార్కింగ్ వ్యవస్థ అందుబాటులోకి వస్తే సెక్రటేరియట్‌కు అవసరమైన విద్యుత్‌లో ఎక్కువ శాతం అక్కడే ఉత్పత్తి చేసుకునే అవకాశం ఉంటుందన్నారు. ఈ వ్యవస్థ ద్వారా సుమారు 90 వేల యూనిట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేయవచ్చునని మంత్రి వెల్లడించారు. ఫలితంగా సెక్రటేరియట్ నెలవారీ విద్యుత్ బిల్లులో దాదాపు 16 శాతం వరకు ఆదా అయ్యే ఛాన్సుందన్నారు. ప్రభుత్వ భవనాల్లో పునరుత్పాదక ఇంధన వినియోగాన్ని పెంచే చర్యల్లో భాగంగా ఈ ప్రాజెక్టుకు ప్రాధాన్యం ఇస్తున్నట్లు మంత్రి పేర్కొన్నారు. సెక్రటేరియట్ ఉత్తర భాగంలో రెండు వరుసలు, దక్షిణ భాగంలో మూడు వరుసలు, పశ్చిమ భాగంలో ఒక వరుసగా సోలార్ ప్యానెళ్లతో కూడిన కార్ పార్కింగ్ షెడ్లను ఏర్పాటు చేయనున్నట్లు అధికారులు మంత్రికి వివరించారు. అందుకు సంబంధించిన డిజైన్లు, నిర్మాణ పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని మంత్రి స్పష్టం చేశారు. పార్కింగ్ సదుపాయం మెరుగుపడటంతో పాటు సౌర విద్యుత్ ఉత్పత్తి జరిగేలా నిర్మాణాన్ని సమర్థవంతంగా పూర్తి చేయాలని సూచించారు.


## కేంద్రం ముందు మోకరిల్లి స్మార్ట్ మీటర్లు పెట్టే కుట్ర చేస్తున్న రేవంత్ సర్కార్




హైదరాబాద్:కేంద్రం తెచ్చిన కొత్త పథకంపై సంతకం పెట్టి రాష్ట్రంలో స్మార్ట్ మీటర్లు పెట్టే ప్రయత్నం రేవంత్ రెడ్డి సర్కార్ చేస్తోందని తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత ఆరోపించారు. గతంలో రైతులను ఇబ్బంది పెట్టేలా చేసిన నల్ల చట్టాల్లో భాగంగా తేవాలనుకున్న స్మార్ట్ మీటర్లను మళ్లీ తేవాలని కేంద్రం చేస్తున్న కుట్రలకు రేవంత్ సర్కార్ మోకరిల్లింది. అదానీ వ్యాపారాన్ని ప్రోత్సహించేందుకు, ప్రజలకు నష్టం చేసేందుకు ఈ స్మార్ట్ మీటర్లను తెస్తున్నారని అన్నారు.దీనికి సంబంధించి ప్రజల మైండ్ వాష్ చేసేందుకు ఇటీవలే నెక్లెస్ రోడ్ లో డెమో కార్యక్రమం పెట్టారు. ఎలక్ట్రిసిటీ డిపార్ట్ మెంట్ సీఎండీ కూడా స్మార్ట్ మీటర్లు తెస్తున్నామని చెప్పారు. గతంలో మనం ఈఆర్సీలో గొడవ చేస్తే రైతుల బావికాడ మోటార్లకు మీటర్లు పెట్టమని చెప్పారు . కానీ ఇప్పుడు ప్రతి ఇంటికి స్మార్ట్ మీటర్లు పెట్టే ప్రయత్నం చేస్తున్నారు. తెలంగాణలో ఇప్పుడున్నవన్నీ కూడా స్మార్ట్ మీటర్లే. కానీ కొత్తగా తేనున్న స్మార్ట్ మీటర్ల ద్వారా చాలా నష్టం ఉంటుంది. ఈ మీటర్ల పెడితే మనం ముందే ఫోన్ లో రీఛార్జ్ చేసుకున్నట్లు ప్రీ పెయిడ్ రీఛార్జ్ చేసుకోవాలి. దీని ద్వారా మనకు ఎప్పుడు రీఛార్జ్ అయిపోతే అప్పుడు కరెంట్ పోతుందని అన్నారు.యూపీలో ఇదే విధంగా మీటర్లు పెడితే ఆ మీటర్లను తీసి ఎలక్ట్రిసిటీ డిపార్ట్ మెంట్ ఆఫీస్ లలో ప్రజలు వేసి వెళున్నారు. పైగా స్మార్ట్ మీటర్ల కారణంగా ప్రభుత్వం ఇస్తామన్న 2 వందల యూనిట్ల ఫ్రీ కరెంట్ ఎత్తివేసే పరిస్థితి ఉంటుంది. సెలూన్లకు ఇచ్చే ఫ్రీ కరెంట్ కు కూడా ఇబ్బంది అవుతుంది. రేవంత్ రెడ్డి సర్కార్ కేంద్రం ముందు మోకరిల్లి తెలంగాణ ప్రజలకు నష్టం చేసే పనిచేస్తుంది. స్మార్ట్ మీటర్ల కారణంగా ఫ్రీ కరెంట్, సెలూన్లకు ఇచ్చే కరెంట్, ఎస్సీ, ఎస్టీలకు ఇచ్చే సబ్సిడీ కరెంట్ ను ఎత్తివేసే ప్రమాదం ఉంది. కనుక ఎట్టి పరిస్థితుల్లో తెలంగాణ రక్షణ సేన ఇందుకు ఒప్పుకోదని హెచ్చరిస్తున్నాం. ముందు ఇప్పుడున్న మీటర్ల ద్వారానే 24 గంటల కరెంట్ ఇచ్చేందుకు ప్రభుత్వం ప్రయత్నం చేయాలి. ఆటిజన్లు, కాంట్రాక్ట్ కార్మికులను రెగ్యులరైజ్ చేసి కరెంట్ సరఫరా బాగా ఉండేలా చూడాలి. ఎప్పుడు ప్రజల జేబులకు చిల్లు పెట్టే కార్యక్రమం కాకుండా వారికి మేలు చేసే పనిచేయాలి. స్మార్ట్ మీటర్లు పెట్టాలన్న ప్రయత్నాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని హెచ్చరిస్తున్నామని అన్నారు.

## మైనారిటీ సంక్షేమ కమిటీ చైర్మన్‌గా తోట లక్ష్మీకాంతారావు బాధ్యతలు

హైదరాబాద్, తెలంగాణ శాసనసభలో మైనారిటీ సంక్షేమ కమిటీ చైర్మన్‌గా జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. మైనారిటీల సంక్షేమం, వారి హక్కుల పరిరక్షణతో పాటు అన్ని రంగాల్లో సమగ్ర అభివృద్ధి సాధించే దిశగా కమిటీ చైర్మన్‌గా తన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తిస్తానని ఈ సందర్భంగా ఆయన తెలిపారు. మైనారిటీ వర్గాల సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లడంతో పాటు సంక్షేమ పథకాలు అర్హులకు చేరేలా కృషి చేస్తానని తోట లక్ష్మీకాంతారావు పేర్కొన్నారు. విద్య, ఉపాధి, ఆర్థికాభివృద్ధి వంటి అంశాల్లో మైనారిటీల పురోగతికి ప్రత్యేక



శ్రద్ధ తీసుకుంటానని తెలిపారు.

## కృష్ణా జలాల కేటాయింపులపై కసరత్తు.. జలసౌధలో కేఆర్ఎంబీ కీలక భేటీ

హైదరాబాద్, రెండు తెలుగు రాష్ట్రాల దాహార్తిని తీర్చే కృష్ణా జలాల పంచాయితీ మరోసారి జలసౌధ మెట్లెక్కింది. వేసవి సమీపిస్తున్న తరుణంలో ప్రాజెక్టుల్లోని నీటి నిల్వల లెక్కింపు, పంపిణీ ప్రక్రియ రెండు రాష్ట్రాలకు అత్యంత కీలకంగా మారింది. మరి శ్రీశైలం, సాగర్ జలాశయాల్లో అందుబాటులో ఉన్న నీటిని ఇరు రాష్ట్రాల అవసరాలకు అనుగుణంగా కేఆర్ఎంబీ సర్దుబాటు చేయనుంది. హైదరాబాద్‌లోని జలసౌధ వేదికగా కృష్ణా నదీ యాజమాన్య బోర్డు (కేఆర్ఎంబీ) త్రిసభ్య కమిటీ సమావేశం సభ్య కార్యదర్శి సతీశ్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ కీలక భేటీకి తెలంగాణ ఈఎన్సీ రమేశ్ బాబు, ఆంధ్రప్రదేశ్ ఈఎన్సీ నరసింహమూర్తి హాజరయ్యారు.రాయలసీమ, పల్నాడు ప్రాంతాల్లో తాగునీటి అవసరాల నిమిత్తం జలాశయాల నుంచి నీటిని విడుదల చేయాలని కోరుతూ ఏపీ ప్రభుత్వం ఇప్పటికే కేఆర్ఎంబీకి లేఖ రాసింది. తొలుత ఈ నెల 13న, అనంతరం 17న జరగాల్సిన ఈ భేటీ ఏపీ అసెంబ్లీ సమావేశాల దృష్ట్యా వాయిదా పడుతూ వచ్చింది. ఎట్టకేలకు సమావేశమైన త్రిసభ్య కమిటీ.. శ్రీశైలం, నాగార్జునసాగర్ రిజర్వాయర్లలో ప్రస్తుతం లభ్యమయ్యే నికర జలాలు, రాబోయే




రోజుల్లో ఉభయ రాష్ట్రాల తాగునీటి ప్రాధాన్యతలపై లోతుగా సమీక్షించింది. తాగునీటి అవసరాలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా నీటి పంపకాలపై ఒక స్పష్టమైన కార్యాచరణను ఖరారు చేసేందుకు అధికారులు ప్రయత్నాలు ముమ్మరం చేశారు.

## ప్రభుత్వ ఆస్తుల రిజిస్ట్రేషన్ అసాధ్యం.. 22ఏ వివాదాలపై రెవెన్యూ శాఖ స్పష్టత




హైదరాబాద్,రాష్ట్రంలో కొద్దిరోజులుగా తీవ్ర చర్చనీయాంశంగా మారిన నిషేధిత '22ఏ' భూముల రిజిస్ట్రేషన్ల వ్యవహారానికి ఎట్టకేలకు తెరపడింది. అర్హులైన సామాన్య పౌరుల భూములకు రిజిస్ట్రేషన్ అడ్డంకులు తొలగిస్తున్నామని చెబుతున్న ప్రభుత్వం... సర్కారు భూములపై కన్నేసిన అక్రమార్కులకు మాత్రం గట్టి హెచ్చరికలు జారీ చేసింది. 24 గంటల్లోనే సమస్యల పరిష్కారం: రాష్ట్రవ్యాప్తంగా 22ఏ జాబితా కారణంగా నిలిచిపోయిన ప్రైవేటు భూముల రిజిస్ట్రేషన్లను యుద్ధప్రాతిపదికన 24 గంటల్లోనే పరిష్కరించామని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేశారు. ఒకట్రెండు చోట్ల సాంకేతిక కారణాలతో ఆగిపోయినా ఎవరూ ఆందోళన చెందాల్సిన పనిలేదన్నారు. ప్రభుత్వ ఆస్తులను రిజిస్ట్రేషన్ చేయాలని ఎంతటి వారు ప్రయత్నించినా అది సాధ్యం కాదని కుండబద్దలు కొట్టారు.వారం రోజుల్లో రుసుము వాపస్: స్లాట్లు బుక్ చేసుకుని రిజిస్ట్రేషన్లు పూర్తికాని పక్షంలో, వారం రోజుల్లోనే ఆ మొత్తాన్ని సంబంధిత పౌరుల బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తామని మంత్రి హామీ ఇచ్చారు. ప్రజల ఫిర్యాదుల కోసం ఏర్పాటు చేసిన టోల్‌ఫ్రీ నంబర్‌కు ఈనెల 18 నుంచి ఇప్పటివరకు 1,162 కాల్స్ వచ్చాయని, వాటన్నింటినీ జిల్లాల వారీగా సంబంధిత అధికారులకు బదిలీ చేసినట్లు వివరించారు. ప్రతి సోమవారం ఉన్నతాధికారులతో సమీక్షించి, కోర్టు ఉత్తర్వులు, 22ఏ తాజా జాబితా వివరాలను వెబ్‌సైట్‌లో నిరంతరం అప్‌లోడ్ చేస్తామన్నారు.మేడ్చల్ భూదాన్ భూములు తిరస్కరణ - ఫోర్జరీలపై నిఘా: మేడ్చల్ జిల్లాలోని భూదాన్ భూములు, మేడ్చల్-రంగారెడ్డి జిల్లాల్లోని సీఎస్-7, సీఎస్-14 వివాదాల్లో ప్రభుత్వ, ప్రైవేటు వ్యక్తుల మధ్య వివాదాలు కొనసాగుతున్నాయని మంత్రి తెలిపారు. భూదాన్, సర్కారు భూముల కు వచ్చిన రిజిస్ట్రేషన్ దరఖాస్తులను తిరస్కరించినట్లు స్పష్టం చేశారు. కొందరు కేటుగాళ్లు అధికారుల సంతకాలను ఫోర్జరీ చేసి రిజిస్ట్రేషన్లు చేయాలని లేఖలు సృష్టిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అలాంటి నిందితులపై కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసులను ఆదేశించినట్లు పొంగులేటి పేర్కొన్నారు. నిజమైన హక్కుదారుల ప్రయోజనాలను కాపాడుతూనే, ప్రభుత్వ భూములను పరిరక్షిస్తామని స్పష్టం చేశారు.

## పాత కార్యకర్తలకు పదవుల్లో తొలి ప్రాధాన్యత

మెదక్,ఉమ్మడి మెదక్ జిల్లా కాంగ్రెస్ పార్టీ సమావేశంలో టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ కీలక వ్యాఖ్యలు చేశారు. డీసీసీ అధ్యక్షుడు ఆంజనేయులు గౌడ్ అధ్యక్షతన జరిగిన పీఏసీ సమావేశానికి రాష్ట్ర మంత్రి దామోదర రాజనర్సింహ, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి, ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్, డీసీసీ అధ్యక్షుడు పూజల హరికృష్ణ, మాజీ మంత్రి చంద్రశేఖర్ రావుతో పాటు పలువురు నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు హాజరయ్యారు. సమావేశంలో పార్టీ కార్యకర్తల సమస్యలు, సంస్థాగత బలోపేతం, భవిష్యత్ రాజకీయ కార్యాచరణపై చర్చించారు. కార్యకర్తల ఆవేదనను పార్టీ నాయకత్వం అర్థం చేసుకుంటుందని మహేష్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు. ఉమ్మడి మెదక్ జిల్లాను కాంగ్రెస్‌కు మరింత బలమైన కంచుకోటగా తీర్చిదిద్దుతామని ధీమా వ్యక్తం చేశారు.

### పాత కార్యకర్తలకు పదవుల్లో ప్రాధాన్యం

పార్టీ కోసం ఎన్నేళ్లుగా కష్టపడిన పాత కార్యకర్తలకు పదవుల్లో తొలి ప్రాధాన్యత ఇస్తామని మహేష్ కుమార్ గౌడ్ తెలిపారు. పార్టీని నమ్ముకుని పనిచేసిన సీనియర్ నాయకులకు పెద్దపీట వేయాలని సూచించారు. మార్కెట్ కమిటీలు, సహకార సంఘాలు, ఆలయాలు, గ్రంథాలయాలు వంటి సంస్థల్లో పదవుల భర్తీ సమయంలో పాత కార్యకర్తలను గుర్తించాలని అన్నారు. కష్టపడి పనిచేసిన కార్యకర్తలకు సహకార సంఘాల్లోనూ తగిన అవకాశాలు కల్పిస్తామని చెప్పారు. పార్టీ బలోపేతానికి క్షేత్రస్థాయిలో పనిచేసే కార్యకర్తలే ప్రధాన బలమని పేర్కొన్నారు.

### ఓటు హక్కు కాపాడుకోవాలని పిలుపు

అర్హత కలిగిన ప్రతి పేదవాడి ఓటు హక్కును కాపాడేందుకు పార్టీ ప్రత్యేకంగా పనిచేస్తోందని మహేష్ కుమార్ గౌడ్ తెలిపారు. కొన్ని నిబంధనల పేరుతో ఓటు హక్కులను తొలగించే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు. నోటీసులు అందుకున్న ప్రతి ఒక్కరూ అవసరమైన వివరాలను సంబంధిత అధికారులకు సమర్పించి తమ ఓటును కాపాడుకోవాలని సూచించారు.

### ఉద్యోగాలపై యువత ప్రశ్నిస్తోంది

కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వంపై కూడా మహేష్ కుమార్ గౌడ్ విమర్శలు చేశారు. ఉద్యోగాల కల్పనపై యువత ప్రశ్నిస్తోందని, ఉపాధి అవకాశాల విషయంలో కేంద్ర ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. మతం, కులం పేరుతో రాజకీయాలు చేసే పరిస్థితిని ప్రజలు గతంలా అంగీకరించడం లేదని వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను సమాంతరంగా ముందుకు తీసుకెళ్తోందని ఆయన పేర్కొన్నారు.



అర్హులైన నిరుపేదలకు ఇళ్లు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని, తెలంగాణలో ఏ ఒక్క పేద కుటుంబం కూడా ఇల్లు లేకుండా ఉండకూడదనే ఉద్దేశంతో కార్యక్రమాలు అమలు చేస్తున్నామని తెలిపారు.

### విపక్షాలపై విమర్శలు

సామాజిక మాధ్యమాల ద్వారా అసత్య ప్రచారం జరుగుతోందని మహేష్ కుమార్ గౌడ్ ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై జరుగుతున్న ప్రచారాన్ని కార్యకర్తలు ప్రజల్లోకి వెళ్లి తిప్పికొట్టాలని సూచించారు. హద్దులు దాటి పార్టీకి నష్టం కలిగించేలా వ్యవహరించే వారిని పార్టీ ఉపేక్షించబోదని స్పష్టం చేశారు. కాంగ్రెస్ పార్టీలో స్వేచ్ఛాయుత వాతావరణం ఉందని పేర్కొంటూ, ఇతర పార్టీల్లో నాయకులు స్వేచ్ఛగా తమ అభిప్రాయాలు చెప్పగలరా అని ప్రశ్నించారు. రానున్న ఎన్నికల్లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ మరింత బలంగా ముందుకు సాగుతుందని, వంద సీట్ల లక్ష్యంతో పనిచేస్తామని ధీమా వ్యక్తం చేశారు.

### ప్రజలకు చేరువగా పాలన

పేదలకు చేరువలో వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని మహేష్ కుమార్ గౌడ్ తెలిపారు. అభివృద్ధి, సంక్షేమ రంగాల్లో తెలంగాణ దేశం ఆశ్చర్యపోయే స్థాయిలో ముందుకు సాగుతుందని వ్యాఖ్యానించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేసి ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. ఉమ్మడి మెదక్ జిల్లాలో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేయడమే లక్ష్యంగా ఈ సమావేశంలో పలు అంశాలపై చర్చించినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి.

## చేతనైతే ఢిల్లీ నుంచి తెలంగాణకు రావాల్సిన నిధులు తీసుకురావాలి..

హైదరాబాద్,ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల అంశంపై బీజేపీ చేపడుతున్న దీక్షలపై మంత్రి పొన్నం ప్రభాకర్ తీవ్రంగా స్పందించారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్ష పదవి వచ్చిన తర్వాత పార్టీలో లొల్లులు పెరిగాయని, తన ఉనికిని కాపాడుకోవడానికే ఫీజు రీయింబర్స్‌మెంట్ దీక్షల పేరుతో రాజకీయాలు చేస్తున్నారని విమర్శించారు. ఫీజు బకాయిల విషయంలో బీజేపీకి నిజంగా చిత్తశుద్ధి ఉంటే ఢిల్లీకి వెళ్లి కేంద్ర ప్రభుత్వం నుంచి తెలంగాణకు రావాల్సిన నిధులను తీసుకురావాలని ఆయన సవాల్ విసిరారు. రాష్ట్ర ప్రభుత్వంపై విమర్శలు చేయడం కంటే కేంద్రం నుంచి రాష్ట్రానికి న్యాయంగా రావాల్సిన నిధుల కోసం పోరాడాలని సూచించారు.

### పాత బకాయిలను పరిష్కరిస్తున్నాం

బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు భారీగా పేరుకుపోయిన సమయంలో బీజేపీ నేతలు ఎందుకు మాట్లాడలేదని పొన్నం ప్రభాకర్ ప్రశ్నించారు. అప్పట్లో మౌనం వహించిన వారు ఇప్పుడు ప్రజా ప్రభుత్వంపై విమర్శలు చేయడం విడ్డూరంగా ఉందని మండిపడ్డారు. పాత బకాయిలను ప్రభుత్వం దశలవారీగా పరిష్కరిస్తోందని తెలిపారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లింపులపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని పేర్కొన్నారు.

### అడ్వాన్స్ చెల్లింపులు.. గ్రీన్ ఛానల్ ద్వారా నిధులు

ఈ విద్యా సంవత్సరం నుంచి ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థులకు ఎలాంటి



## సంపాదకీయం

**మంగళవారం 25-08-2026**

# నిరంతర విద్యుత్తుకు అణు భరోసా

పంద్రాగస్టు సందర్భంగా ప్రధాని మోదీ ఎర్రకోట ప్రసంగంలో సెమీకండక్టర్ చిప్‌లు, అణు రియాక్టర్లు వంటి కీలక అంశాలను ప్రస్తావించారు. పైకి ఇవి వేర్వేరు రంగాల్లా కనిపించినా, వాటి మధ్య బలమైన లంకె ఉంది. చిప్ కర్మాగారాలకు నిరంతరాయంగా విద్యుత్ సరఫరా అవసరం. మరి, ఆ విద్యుత్తు ఎక్కడి నుంచి వస్తుందన్నదే ప్రశ్న. ఇటీవల కల్పాక్కంలోని ఫాస్ట్ బ్రీడర్ రియాక్టర్ క్రిటికాలిటీ సాధించడంతో, ఆరు దశాబ్దాల భారత అణు కార్యక్రమం రెండో దశలోకి అడుగుపెట్టింది. దీంతో ఇంధన భద్రతపై ఆశలు పెరుగుతున్నాయి.అణు విద్యుత్ కేంద్రం కూడా ఒక సాధారణ బొగ్గు(ఉష్ణ) విద్యుత్ కేంద్రంలాగే పనిచేస్తుంది. ఈ రెండింటి మధ్య ఉన్న ఒకే ఒక్క తేడా- నీటిని వేడి చేయడానికి వాడే ఇంధనమే. బొగ్గు కేంద్రంలో కోల్‌ను మండించి వేడిని పుట్టిస్తే, అణు రియాక్టర్‌లో అణువిచ్ఛిత్తి ద్వారా వేడిని తయారు చేస్తారు. ఆ వేడితో నీటిని మరిగించి ఆవిరిగా మార్చి, ఆ ఆవిరి ఒత్తిడితో టర్బైన్‌ను వేగంగా తిప్పుతారు. తద్వారా టర్బైన్‌కు అనుసంధానించిన జనరేటర్ ద్వారా విద్యుత్తు ఉత్పత్తి అవుతుంది. కేవలం ఒక కిలో యురేనియం నుంచి వచ్చే శక్తి, కిలో బొగ్గు కంటే దాదాపు పదిలక్షల రెట్లు ఎక్కువగా ఉంటుంది. దీనివల్ల పర్యావరణానికి హాని చేసే కర్బన ఉద్గారాలు కూడా తక్కువే వెలువడతాయి. కాలుష్య రహితమైన అపార శక్తిని అందిస్తుండటంతో ప్రపంచవ్యాప్తంగా అణు విద్యుత్తుకు ప్రాధాన్యం పెరుగుతోంది.

కీలక మైలురాయి

దేశంలో ప్రస్తుతం 24 అణు రియాక్టర్లుండగా, మొత్తం 8,780 మెగావాట్ల సామర్థ్యం ఉంది. 2024-25లో అవి దాదాపు 5,700 కోట్ల యూనిట్ల విద్యుత్తును ఉత్పత్తి చేశాయి. అయినా దేశ విద్యుత్ ఉత్పత్తిలో అణు వాటా సుమారు మూడు శాతమే. బొగ్గు వాటా 70 శాతానికి దగ్గరగా ఉంది. 2031-32 నాటికి అణు విద్యుత్ సామర్థ్యాన్ని 22,480 మెగావాట్లకు, 2047 నాటికి 100 గిగావాట్లకు పెంచాలన్నది లక్ష్యం. భారత అణు పితామహుడిగా పేరొందిన హోమీ భాభా మన దేశంలోని వనరుల పరిమితిని దృష్టిలో పెట్టుకుని అణు కార్యక్రమాన్ని రూపొందించారు. మనకు యురేనియం నిల్వలు తక్కువ. థోరియం సమృద్ధిగా ఉంది. కానీ థోరియాన్ని నేరుగా ఇంధనంగా వాడలేం. మొదటి దశలో సహజ యురేనియంతో భారజల రియాక్టర్లు నడుస్తాయి. ఈ ప్రక్రియ ద్వారా తయారయ్యే ప్లుటోనియం-239ను రెండో దశలో ఫాస్ట్‌బ్రీడర్ రియాక్టర్లలో ఇంధనంగా వాడతారు. ఈ రియాక్టర్లలోని యురేనియం-238 న్యూట్రాన్లను గ్రహించి కొత్త ప్లుటోనియం-239గా మారుతుంది. మూడో దశలో థోరియం-232 న్యూట్రాన్లను గ్రహించి, వరస అణు పరివర్తనల ద్వారా యురేనియం-233గా మారుతుంది. అప్పుడు దీన్ని ఇంధనంగా ఉపయోగించవచ్చు. అందుకే రెండోదశ విజయం మూడోదశకు కీలకం. మొన్న ఏప్రిల్ 6న కల్పాక్కంలోని 500 మెగావాట్ల ప్రోటోటైప్ ఫాస్ట్ బ్రీడర్ రియాక్టర్ తొలిసారి క్రిటికాలిటీ సాధించింది. అంటే బయటి నుంచి న్యూట్రాన్లను అందించాల్సిన అవసరం లేకుండా, గొలుసు చర్య తనంతట తానే స్థిరంగా కొనసాగే స్థితికి రియాక్టర్ చేరుకుంది. అయితే, ఈ రియాక్టర్ నిర్మాణం 2004లో మొదలై, తొలి క్రిటికాలిటీకి 22 ఏళ్లు పట్టింది. కొత్త లక్ష్యాలు సాధించాలంటే వేగం పెరగాల్సిన అవసరాన్ని ఇది చెబుతోంది. థోరియం మన నేలలో ఉన్నా, దాన్ని ఇంధనంగా మార్చేందుకు రెండో దశ రియాక్టర్లు ముందుగా పనిచేయాలి. అందుకే కల్పాక్కం రియాక్టర్ క్రిటికాలిటీ ఒక మైలురాయి. నిరుడు పార్లమెంటు 'శాంతి' చట్టాన్ని ఆమోదించింది. లైసెన్సు పొందిన ప్రైవేటు సంస్థలకు అణు విద్యుత్ కేంద్రాల నిర్మాణం, నిర్వహణకు మార్గం తెరిచింది. యురేనియం శుద్ధి, ఇంధన పునఃశుద్ధి ప్రభుత్వ అధీనంలోనే ఉంటాయి. నష్టపరిహార వ్యవస్థలోనూ మార్పులు చేసి, సరఫరాదారుల బాధ్యతను తొలగించి నిర్వాహక సంస్థ బాధ్యతను పరిమితి విధించారు. దీంతో దేశీయ ప్రైవేట్ పెట్టుబడులకు, విదేశీ సంస్థల నుంచి సాంకేతికత, పరికరాల సరఫరాకు మార్గం సుగమమైంది. భవిష్యత్ సామర్థ్యంలో చిన్న రియాక్టర్ల పాత్ర కీలకం కావడంతో భాభా అణు పరిశోధన కేంద్రం 200 మెగావాట్ల భారత్ స్మాల్ మాడ్యులర్ రియాక్టర్, 55 మెగావాట్ల చిన్న రియాక్టర్, హైడ్రోజన్ ఉత్పత్తికి 5 మెగావాట్ల థర్మల్ గ్యాస్ రియాక్టర్‌ను అభివృద్ధి చేస్తోంది. చిన్న రియాక్టర్లను కర్మాగారంలో తయారు చేసి, అవసరమైన చోటుకు తరలించవచ్చు. మూతపడుతున్న బొగ్గు కేంద్రాల స్థలాల్లో వీటిని ఏర్పాటుచేస్తే, ఇప్పటికే ఉన్న గ్రిడ్ సదుపాయాన్ని కూడా వాడుకోవచ్చు.

పెరుగుతున్న అవసరం

రానున్న కాలంలో విద్యుత్ అవసరం భారీగా పెరగనుంది. వాతావరణ లక్ష్యాల దృష్ట్యా బొగ్గుపై ఆధారపడలేం. సౌర, పవన విద్యుత్తు నిరంతరం అందుబాటులో ఉండవు. భారీ నిల్వ వ్యవస్థ కూడా సిద్ధంగా లేదు. అందుకని నిరంతరాయంగా విద్యుత్తును అందించే అణుశక్తి మన ఇంధన వ్యవస్థలో కీలక భాగం కావాలి. భాభా 1950లలో ఈ దారిని ఎంచుకున్నప్పుడు పరిశ్రమలు తక్కువ, వనరులు పరిమితం. యురేనియం తక్కువగా, థోరియం సమృద్ధిగా ఉన్న దేశానికి ఇది సుదీర్ఘ ప్రయాణమని ఆయనకు తెలుసు. అందుకని, మూడు దశల మార్గాన్ని రూపొందించారు. ఇన్నేళ్లకు రెండో దశకు చేరుకున్నాం. ఇక మూడో దశను సాకారం చేయాల్సిన సమయం వచ్చింది. రియాక్టర్ల ఏర్పాటుకు భూసేకరణ, అనుమతులు, ఇంధన సరఫరాతో పాటు వేలమంది ఇంజినీర్లు, రేడియేషన్ భద్రతా నిపుణులు, నియంత్రణ అధికారులను సిద్ధం చేసుకోవాలి. రియాక్టర్లను సకాలంలో నిర్మించి, నిపుణులను సిద్ధం చేయగలిగితే, ప్రణాళికలను కార్యాచరణ రూపంలోకి తేగలిగితే 2047 నాటికి అణు భారతం కేవలం లక్ష్యం కాదు- సాధించగలిగే వాస్తవమవుతుంది. ఈ ప్రయాణాన్ని వేగంగా ముందుకు తీసుకెళ్లడమే ముందున్న కర్తవ్యం.

# సగం హైదరాబాద్ లో సెటిలర్స్ ప్రభావమే...

హైదరాబాద్,ఆంధ్రా సెటిలర్స్ ఈసారి హైదరాబాద్‌లో ఓట్లేయడం లేదా.. అన్న విషయం ఇప్పుడు తెలంగాణ రాజకీయాల్లో హాట్ టాపిక్‌గా మారింది. తెలంగాణ తర్వాత భారీగా ఓట్లు కేటగిరీలోకి వెళ్లడం, మరికొన్ని లక్షల ఓట్లు ఉండటం హైదరాబాద్ రాజకీయాలపై కొత్త చర్చకు తెరతీసింది. సెటిలర్స్ ప్రభావం ఉన్న నియోజకవర్గాల్లో ఓట్ల తగ్గుదల ఆసక్తికరంగా మారింది. తెలంగాణ ఎన్నికలు అనగానే ప్రత్యేకంగా చర్చకు వచ్చే అంశాల్లో ఆంధ్రా సెటిలర్స్ ఓట్లు ఒకటి. ముఖ్యంగా గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని ఆంధ్రా ఓటర్లు ఎన్నికల ఫలితాలను ప్రభావితం చేసే కీలక వర్గంగా చాలాకాలంగా చర్చలో ఉంటున్నారు. కోర్ అర్బన్ ప్రాంతంలోని 28 అసెంబ్లీ నియోజకవర్గాల్లో కనీసం 15 నియోజకవర్గాల్లో వీరి ప్రభావం గణనీయంగా ఉందనే అంచనాలు ఉన్నాయి.ప్రతి ఎన్నికల సమయంలో ఆంధ్రా సెటిలర్స్ ఓట్లు ఏ వైపు మొగ్గుతాయి? ఏ పార్టీకి లాభం చేకూరుతుంది? అనే చర్చ జరుగుతూనే ఉంటుంది. అయితే ఈసారి పరిస్థితి కొంత భిన్నంగా కనిపిస్తోంది.తెలంగాణలో జరుగుతున్న ప్రత్యేక ఓటరు సవరణ ప్రక్రియ?లో భారీ సంఖ్యలో ఓట్లు జాబితా నుంచి తొలగించడం మరికొన్ని ఓట్లను పెండింగ్‌లో ఉంచడం ఇప్పుడు కొత్త రాజకీయ చర్చకు దారితీస్తోంది. తెలంగాణలో ఎన్నికల సంఘం ప్రత్యేక ఓటరు సవరణ అంటే స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ఓ షాకింగ్ విషయాన్ని బయటపెట్టింది. ముసాయిదా ప్రకటనలో ఏకంగా తెలంగాణలో ఇప్పటికే 73లక్షల ఓట్లను తొలగించారు. వీళ్లను లో పెట్టారు. అంటే గైర్హాజరు, వేరే ప్రాంతానికి మారిన వారు, తొలగించబడిన లేదా డూప్లికేట్ ఓటర్లుగా గుర్తించిన వారి ఓట్లు ఈ కేటగిరీలోకి వెళ్లాయి. అంటే.. మళ్లీ అప్లై చేసుకుంటే తప్ప ఈ ఓట్లు లేనట్లే. జూన్ నాటికి తెలంగాణలో మొత్తం 3 కోట్ల 38 లక్షల 26 వేల మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో 73 లక్షల ఓట్లు పోయాయంటే.. మొత్తం ఓటర్లలో దాదాపు 22 శాతం ఓట్లు జాబితా నుంచి బయటకు వెళ్లినట్టవుతుంది. తర్వాత తెలంగాణ ఓటర్ల జాబితాలో 2,64,87,213 ఓట్లు మిగిలాయి. అయితే ఈ ఓట్లన్నీ పూర్తిగా ధృవీకరించినవని చెప్పలేమని ఎన్నికల అధికారులు పేర్కొంటున్నారు. మరో 92,87,577 ఓట్లను విత్ హెల్డ్ కేటగిరీలో ఉంచారు. ఈ ఓట్లకు సంబంధించి మ్యాపింగ్‌లో తేడాలు, సమర్పించిన పత్రాలు 2002 రికార్డులతో సరిపోకపోవడం వంటి కారణాలతో వాలిడేషన్ పూర్తికాలేదని చెబుతున్నారు.అంటే తెలంగాణలో తొలగించబడిన 73 లక్షల ఓట్లతో పాటు మరో దాదాపు 93 లక్షల ఓట్లు కూడా ప్రస్తుతం తుది స్థితిలో లేవు.తొలగించిన, పెండింగ్‌లో ఉంచిన ఓట్లను కలిపితే ఈ సంఖ్య దాదాపు 1.66 కోట్లు.అంటే తెలంగాణ మొత్తం ఓటర్లలో దాదాపు సగం ఓట్లు ఏదో ఒక రకంగా ప్రభావానికి లోనైనట్టుగా కనిపిస్తోంది.ఇక్కడే అసలు కీలకమైన విషయం బయటకు వస్తోంది. తెలంగాణలో కేటగిరీలోకి వెళ్లిన 73 లక్షల ఓట్లలో 43 లక్షల ఓట్లు హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లాల పరిధిలోనే ఉన్నాయని లెక్కలు సూచిస్తున్నాయి. అంటే తెలంగాణలోని 33 జిల్లాల్లో తొలగించబడిన ఓట్లలో దాదాపు 60 శాతం ఈ మూడు జిల్లాల్లోనే ఉన్నాయి. ఇదే సమయంలో ఈ మూడు జిల్లాల్లో మరో 39 లక్షల ఓట్లు అభ్యంతరాలు, మ్యాపింగ్ లేదా ఇతర ధృవీకరణ సమస్యల కారణంగా పెండింగ్‌లో ఉన్నట్లు చెబుతున్నారు. అంటే తొలగించబడిన లేదా ఇంకా పూర్తిగా ఆమోదించబడని ఓట్లలో దాదాపు 83 లక్షలు కేవలం ఈ మూడు జిల్లాల పరిధిలోనే ఉన్నాయి.ఇక్కడి నుంచే కేవలం ఓటర్ల లెక్కలకు సంబంధించిన అంశమేనా? లేక హైదరాబాద్ రాజకీయ సమీకరణాలపై కూడా ప్రభావం చూపుతుందా? అనే ప్రశ్న మొదలవుతోంది. హైదరాబాద్ మెట్రోపాలిటన్ ప్రాంతంలో ఇందులో 43 లక్షల ఓట్లు కేటగిరీలోకి వెళ్లినట్లు లెక్కలు చెబుతున్నాయి. అంటే మెట్రోపాలిటన్ ప్రాంతంలోని దాదాపు 37 శాతం ఓట్లు ప్రభావితమయ్యాయి. తెలంగాణలో నమోదైన ప్రతి 100 ఓట్లలో దాదాపు 59 ఓట్లు హైదరాబాద్ మెట్రో ప్రాంతం నుంచే ఉన్నట్లు కనిపిస్తోంది.అయితే ఈ 43 లక్షల ఓట్లన్నీ ఆంధ్రా సెటిలర్స్‌వే అని చెప్పడానికి ఆధారం లేదుహైదరాబాద్ ఒక మెట్రో నగరం కావడంతో తెలంగాణలోని ఇతర జిల్లాల నుంచి, అలాగే ఇతర రాష్ట్రాల నుంచి వచ్చి ఇక్కడ స్థిరపడిన ప్రజలు కూడా పెద్ద సంఖ్యలో ఉన్నారు.అయితే ఆంధ్రా సెటిలర్స్ ప్రభావం ఎక్కువగా ఉన్న నియోజకవర్గాల్లో ఈ మార్పులు రాజకీయంగా ఆసక్తికరంగా మారాయి.మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లాలోని కుత్బుల్లాపూర్, కూకట్‌పల్లి, మల్కాజ్‌గిరి నియోజకవర్గాల్లో ఆంధ్రా సెటిలర్స్ ప్రభావం ఎక్కువగా ఉందనే చర్చ ఉంది. రంగారెడ్డి, హైదరాబాద్ పరిధిలోని శేరిలింగంపల్లి, పటాన్‌చెరు, జూబ్లీహిల్స్, సనత్‌నగర్, ఖైరతాబాద్, రాజేంద్రనగర్, ఎల్‌బీనగర్ వంటి నియోజకవర్గాల్లో కూడా ఇదే పరిస్థితి కనిపిస్తుంది.మొత్తంగా కోర్ అర్బన్



ప్రాంతంలోని 28 నియోజకవర్గాల్లో దాదాపు 15 చోట్ల ఆంధ్రా సెటిలర్స్ ప్రభావం స్పష్టంగా ఉంటుందని రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది.ఇక కొన్ని నియోజకవర్గాల్లో ఎన్యూమరేషన్ తిరిగి ఇవ్వని వారి శాతం కూడా గమనించదగ్గ స్థాయిలో ఉంది.సనత్‌నగర్‌లో 45 శాతం, జూబ్లీహిల్స్‌లో 45 శాతం, ముషీరాబాద్‌లో 43 శాతం, ఎల్‌బీనగర్‌లో 44 శాతం ఫారాలు తిరిగి ఇవ్వలేదని లెక్కలు చెబుతున్నాయి. అయితే వీరంతా ఆంధ్రా సెటిలర్స్ అని చెప్పలేం కానీ.. ఈ నియోజకవర్గాల పరిధిలో ఆంధ్రా ప్రజలు ఎక్కువగా ఉంటున్నారన్నది నిజం. వాళ్లలో మెజారిటీ ఆంధ్రా ప్రాంతంలోనే ఓటుహక్కును కొనసాగించుకున్నారు. ఈ విషయంలు క్షేత్రస్థాయి పర్యటనలకు వెళ్లినప్పుడు కూడా తెలిసింది. చాలా కాలనీల్లో " వేం మా ఊళ్లలోనే ఓటును కొనసాగించుకుంటాం" అని చెప్పారు. నియోజకవర్గాల వారీగా చూస్తే కొన్ని ప్రాంతాల్లో ఓట్ల తగ్గుదల గణనీయంగా కనిపిస్తోంది. శేరిలింగంపల్లిలో 3.2 లక్షలకు పైగా ఓట్లు తగ్గాయి. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో అత్యధికంగా, దాదాపు 42 శాతం ఓట్లు తగ్గిన నియోజకవర్గంగా ఇది నిలిచింది. ఆ తర్వాత ఎల్‌బీనగర్‌లో 2.7 లక్షలు, రాజేంద్రనగర్‌లో 2.4 లక్షలు, మహేశ్వరంలో 2.3 లక్షల ఓట్లు తగ్గినట్లు లెక్కలు చెబుతున్నాయి.అయితే ఒక నియోజకవర్గంలో ఎన్ని ఓట్లు తగ్గాయి అన్నది మాత్రమే రాజకీయంగా ముఖ్యం కాదు. ఎవరి ఓట్లు తగ్గాయి? అన్నదే అసలు ప్రశ్న. ఎందుకంటే ఓటర్ల సంఖ్య తగ్గడం ప్రతి పార్టీపై ఒకే విధమైన ప్రభావాన్ని చూపదు.ఈ మూడు జిల్లాల్లో హైదరాబాద్ జిల్లాకు ప్రత్యేక పరిస్థితి ఉంది. పాతబస్తీతో పాటు నగరంలోని అనేక ప్రాంతాలను కలుపుకున్న హైదరాబాద్ జిల్లాలో 47 లక్షలకు పైగా ఓటర్లు ఉన్నారు.వారిలో దాదాపు 19 లక్షల మంది తిరిగి రిజిస్టర్ చేసుకోలేదని లెక్కలు చెబుతున్నాయి. అంటే దాదాపు 40 శాతం ఓటర్లపై ప్రభావం పడినట్టుగా కనిపిస్తోంది. పాతబస్తీ ప్రాంతంలో అనేక మంది ఓటర్లకు సరైన పత్రాలు లేకపోవడం, ప్రక్రియలో అవసరమైన డాక్యుమెంట్లను సమర్పించలేకపోవడం వంటి కారణాలు కూడా ఈ పరిస్థితికి కారణమై ఉండవచ్చని చెబుతున్నారు. డాక్యుమెంట్లు ఇచ్చిన వారిలో కూడా 12లక్షల మందికి ఇక్కడ నోటీసులు ఇచ్చారు. ఇప్పటికే తొలగించబడిన ఓట్లతో పాటు మరో భారీ సంఖ్యలో ఓటర్లకు ఎన్నికల సంఘం నుంచి నోటీసులు వెళ్తున్నాయి. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లాల్లో మరో 27 లక్షల ఓట్లకు సంబంధించి నోటీసులు ఇచ్చినట్లు సమాచారం. పత్రాల్లో తప్పులు, 2002 మ్యాపింగ్‌తో సరిపోని వివరాలు వంటి కారణాలతో ఈ నోటీసులు ఇచ్చారు.ఈ ఓట్లలో ఎన్ని తిరిగి ధృవీకరించబడతాయి? ఎన్ని ఓట్లు తుది జాబితాలోకి వస్తాయి? అనేది తదుపరి ప్రక్రియలో తేలాల్సి ఉంది. హైదరాబాద్ జిల్లాలో 12లక్షల మందికి నోటీసులు వెళ్లాయి. తొలగించిన ఓట్లకు ఇవి అదనం. తెలంగాణ ఏర్పడిన తర్వాత హైదరాబాద్‌లో స్థిరపడిన ఆంధ్రా సెటిలర్స్... రాజకీయంగా కొంత ప్రభావం చూపించారు. వీరిలో కొంతమంది ఇక్కడ ఎన్నికల్లో పోటీ చేసి గెలుపొందిన వారున్నారు. ఇప్పుడు ఓట్ల రివిజన్ తర్వాత పరిస్థితి పూర్తిగా మారిపోనుందా అన్న చర్చ మొదలైంది. ఇక్కడ సెటిలైన వారు.. హైదరాబాద్ ఓటర్లుగా పూర్తిగా మారారా?లేక... "మా ఓటు సొంత రాష్ట్రంలోనే కొనసాగాలి" అని నిర్ణయించుకున్నారా? అనే ప్రశ్న వస్తోంది. రెండో పరిస్థితి పెద్ద సంఖ్యలో నిజమైతే ఒక ఆసక్తికరమైన పరిస్థితి ఏర్పడుతుంది."హైదరాబాద్‌లో ఆంధ్రా జనాభా కనిపిస్తుంది. కానీ ఆంధ్రా ఓటు కనిపించదు." ఇది హైదరాబాద్‌లోని రాజకీయ పార్టీలకు కీలకమైన అంశంగా మారే అవకాశం ఉంది.హైదరాబాద్‌లోని ఆంధ్రా సెటిలర్స్ ఓట్లన్నీ ఒకే పార్టీకి వెళ్తాయనే అభిప్రాయం కూడా పూర్తిగా సరైంది కాదు. తెలుగుదేశం పార్టీ తెలంగాణలో యాక్టివ్‌గా ఉన్న సమయంలో ఆంధ్రా సెటిలర్స్‌లో కొంత

# లోకల్ పోరులో వైసీపీ

విజయవాడ, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలు అత్యంత ఆసక్తికరంగా మారాయి. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఇటీవల తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన సమావేశాల్లో పార్టీ కేడర్‌కు, నియోజకవర్గ ఇన్‌ఛార్జులకు అత్యంత స్పష్టమైన దిశానిర్దేశం చేశారు. ఎక్కడా ఏకగ్రీవాలకు తావివ్వకూడదు, ప్రతి స్థానంలోనూ వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు విధిగా బరిలో నిలబడి గట్టి పోటీ ఇవ్వాలి అని ఆదేశించారు. అయితే, 2021 స్థానిక ఎన్నికల్లో వేలాది పంచాయతీలు, ఎంపీటీసీ, జెడ్పీటీసీ స్థానాలను ఏకగ్రీవం చేసుకుని రికార్డు సృష్టించిన వైఎస్సార్‌సీపీ.. ఇవాళ ఏకగ్రీవాలు వద్దే వద్దు, పోటీ పడాల్సిందే అని పట్టుబట్టడం వెనుక కీలక రాజకీయ వ్యూహం ఉంది. గతంలో తమకు కలిసివచ్చిన ఏకగ్రీవ సూత్రాన్ని జగన్ ఇప్పుడు తీవ్రంగా వ్యతిరేకించడం వెనుక ప్రధానంగా కేడర్ నైతిక స్థైర్యం దెబ్బతిందనే ఆందోళన కనిపిస్తోంది. 2024 శాసనసభ ఎన్నికల్లో కేవలం 11 సీట్లకే పరిమితమై దారుణ ఓటమిని చవిచూసిన తర్వాత, క్షేత్రస్థాయిలో ద్వితీయ శ్రేణి నేతలు, గ్రామస్థాయి కార్యకర్తలు తీవ్ర నిరాశలో కూరుకుపోయారు. ఇప్పుడు అధికారంలో ఉన్న టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి హవా నడుస్తోంది. ఈ పరిస్థితుల్లో పంచాయతీ లేదా మండల స్థాయిల్లో ఎన్నికలు వస్తే, అధికార పక్షం బెదిరింపులకో లేక ప్రలోభాలకో లొంగిపోయి వైఎస్సార్‌సీపీ నాయకులు నామినేషన్లు కూడా వేయకుండా వెనక్కి తగ్గుతారని జగన్ బలంగా సందేహిస్తున్నారు. బరిలోనే నిలబడకుండా ఏకగ్రీవాలకు సహకరిస్తే, అది పార్టీ క్షేత్రస్థాయి వ్యవస్థ పూర్తిగా కుప్పకూలిందనే సంకేతాన్ని ప్రజల్లోకి తీసుకెళుతుందనేది ఆయన భయం.పార్టీ ద్వితీయ శ్రేణి నేతలు, స్థానిక నాయకులు పెద్ద ఎత్తున కూటమి వైపు లేదా అధికార టీడీపీ వైపు వలస వెళ్తారనే ఆందోళన. స్థానిక ఎన్నికల్లో పోటీ చేయకపోతే, గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న వైఎస్సార్‌సీపీ నాయకులు తమ వ్యాపారాలు, కాంట్రాక్టులు, లేదా స్థానిక ఉనికిని కాపాడుకోవడానికి అధికార పార్టీతో లోపాయికారీ ఒప్పందాలు కుదుర్చుకునే ప్రమాదం ఉంది. ఒకసారి స్థానిక నేతలు టీడీపీతో కరచాలనం చేస్తే, వారితో పాటు కింద ఉన్న సాంప్రదాయ ఓటు బ్యాంకు కూడా చేజారిపోతుంది. ఈ రకమైన గ్రౌండ్ లెవెల్ మెల్ట్‌డౌన్ నిరోధించాలంటే.. వారిని బలవంతంగానైనా పోలింగ్ బరిలో నిలబెట్టి, పార్టీ రంగు పులుముకునేలా చేయడం తప్ప జగన్‌కు వేరే మార్గం కనిపించడం లేదు.అంతేకాకుండా, ఈ స్థానిక సంస్థల ఎన్నికల్లో గనుక వైఎస్సార్‌సీపీ పోటీకి దూరంగా ఉండి లేదా నామమాత్రపు ప్రదర్శన ఇస్తే, దాని ప్రభావం రాబోయే సార్వత్రిక ఎన్నికల నాటికి కోలుకోలేని దెబ్బగా మారుతుందని జగన్ మోహన్ రెడ్డి భావిస్తున్నారు. సాధారణంగా లోకల్ బాడీ ఎన్నికల్లో వచ్చే ఫలితాలు, అక్కడ నిలబడే అభ్యర్థుల పోరాట పటిమపైనే తదుపరి అసెంబ్లీ ఎన్నికల పునాది ఆధారపడి ఉంటుంది. పోటీ లేకుండా స్థానాలను కూటమికి అప్పగిస్తే, వైఎస్సార్‌సీపీ పని అయిపోయింది అనే నరేటివ్ ప్రజల్లోకి బలంగా వెళుతుంది. దీన్ని తిప్పికొట్టడానికే, ఏకగ్రీవాలను పూర్తిగా నిషేధించి, ప్రతి వార్డు, ప్రతి పంచాయతీలోనూ పోటీ వాతావరణాన్ని రగిల్చేందుకు జగన్ ప్రయత్నిస్తున్నారు.సొంత డబ్బులు ఖర్చు పెట్టుకుని, అధికార పార్టీ దాడిని, పోలీసు కేసులను తట్టుకుని పోటీ చేయడానికి చాలామంది వైఎస్సార్‌సీపీ నాయకులు సిద్ధంగా లేరన్న ప్రచారం జరుగుతోంది. గతంలో మాకు అధికారం ఉన్నప్పుడు ఏకగ్రీవాల పేరుతో ఇతరులను పోటీ చేయనివ్వలేదు.. ఇప్పుడు మేము పోటీ చేస్తామంటే కూటమి నేతలు ఊరుకుంటారా.. పైగా పార్టీ నుంచి ఎలాంటి ఆర్థిక సాయం అందనప్పుడు మేము ఎందుకు జైలు పాలవ్వాలి అని కొందరు స్థానిక నాయకులు అంతర్గత సంభాషణల్లో ప్రశ్నిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ స్థానిక సమరంలో వైఎస్సార్‌సీపీ ఏమేరకు నిలబడి పోరాడుతుందో, లేక జగన్ భయపడినట్లే కూటమి ఏకపక్ష విజయ సాధన వైపు దూసుకుపోతుందో వేచి చూడాల్సిందే!

# మరో ఎంపీకి అమాత్య యోగం

హైదరాబాద్ ,కేంద్ర మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణ జరుగుతుందన్న ప్రచారం నేపథ్యంలో తెలంగాణ నుంచి ఒకరికి అవకాశం వస్తుందన్న సమాచారంపై ఆసక్తికర చర్చ జరుగుతోంది. ఇటీవల చేపట్టిన బీజేపీ కేంద్ర కమిటీ విస్తరణలో తెలంగాణ నుంచి ఎవరికీ అవకాశం ఇవ్వకపోవడం, అదే సమయంలో రాష్ట్రానికి చెందిన ఇద్దరు ప్రముఖ నేతలను జాతీయ కార్యకర్గం నుంచి తప్పించడంతో ఈ ప్రచారానికి ఊతమిస్తుందని చెబుతున్నారు. రాష్ట్రంలో బీజేపీకి 8 మంది ఎంపీలు ఉండగా, ఇప్పటికే ఇద్దరు మంత్రులుగా వ్యవహరిస్తున్నారు. పునర్వ్యవస్థీకరణలో మరొకరికి చాన్స్ ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వ పెద్దలు భావిస్తున్నారని అంటున్నారు.మరో రెండేళ్లలో జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ హాట్ ఫేవరెట్ గా పోటీ ఇవ్వాలంటే రాష్ట్రంలో బీజేపీ నేతలు మరింత క్రియాశీలంగా పనిచేయాలని కేంద్ర పెద్దలు భావిస్తున్నట్లు చెబుతున్నారు. ప్రస్తుతం ప్రతిపక్షాన్ని వెనక్కి నెట్టి ఆ స్థానంలో పోటీ ఇవ్వడమే కాకుండా, అధికారంలోకి రావాలంటే పార్టీని ఇంకా విస్తరించాలని బీజేపీ అగ్రనేతలు భావిస్తున్నారని చెబుతున్నారు. తమ లక్ష్యానికి చేరువ కావాలంటే పార్టీని పరిగెత్తించాలని, ఇందుకోసం నేతలకు కొత్త పదవులతో ప్రోత్సహించాలని అధిష్టానం ఆలోచిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. దీంతో త్వరలో జరగబోయే కేంద్ర మంత్రి వర్గ విస్తరణలో తెలంగాణ నుంచి కచ్చితంగా ఒకరికి అవకాశం వస్తుందని అంచనా వేస్తున్నారు. రాష్ట్రంలో 8 మంది ఎంపీలు ఉండగా, ఇప్పటికే ఇద్దరు కేంద్ర మంత్రులుగా ఉన్నారు. ఇంకా మిగిలిన ఆరుగురిలో ఒకరికి చాన్స్ ఇస్తారా? లేక బయట రాష్ట్రాల నుంచి పార్లమెంటుకు ప్రాతినిధ్యం వహిస్తున్న రాష్ట్రానికే చెందిన ఎంపీలకు అవకాశం ఇస్తారా? అనేది హాట్ టాపిక్ అవుతోంది. ప్రస్తుతం రాష్ట్రానికి చెందిన ఇద్దరు బీజేపీ నేతలు బయట రాష్ట్రాల నుంచి రాజ్యసభ సభ్యులుగా పనిచేస్తున్నారు. వీరిలో సంఘ్ నేపథ్యం ఉన్న ఓబీసీ మోర్చా మాజీ అధ్యక్షుడు లక్ష్మణ్, బీసీ ఉద్యమ నాయకుడు ఆర్.కృష్ణయ్య ఉన్నారు. లక్ష్మణ్ ఉత్తరప్రదేశ్ నుంచి కృష్ణయ్య ఏపీ నుంచి రాజ్యసభ సభ్యులుగా ఉన్న విషయం తెలిసిందే. ఈ పరిస్థితుల్లో రాష్ట్రానికి చెందిన 8 మందిలో ఎవరికి మంత్రి పదవి లభిస్తుందనేది విస్తృత చర్చగా ఉందని చెబుతున్నారు. ప్రధానంగా అనేక సమీకరణాలను పరిశీలిస్తున్న బీజేపీ అధిష్టానం బీసీ, మహిళ కోటాలో ఒకరికి అవకాశం ఇవ్వాలని భావిస్తున్నట్లు చెబుతున్నారు. అయితే ఇప్పటికే బీసీ కోటాలో కరీంనగర్ పార్లమెంటు సభ్యుడు బండి సంజయ్ మంత్రిగా ఉండటంతో రాష్ట్రానికి చెందిన మహిళా నాయకురాలు డీకే అరుణ మంత్రి పదవి రేసులో ముందున్నట్లు ప్రచారం జరుగుతోంది. డీకే అరుణను మంత్రి వర్గంలోకి తీసుకోవాలనే ఆలోచనతోనే ఆమెను బీజేపీ జాతీయ ఉపాధ్యక్ష పదవి నుంచి తప్పించారని చెబుతున్నారు. కేంద్రం చెప్పిన కారణమేంటి? ప్రస్తుత సమీకరణాలను పరిశీలిస్తే కేంద్ర మంత్రివర్గంలో డీకే అరుణకు చోటిచ్చే పరిస్థితులే ఎక్కువగా కనిపిస్తున్నాయని అంటున్నారు. డీకే అరుణ సీనియార్టీ, సామాజిక నేపథ్యంతో పాటు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని దీటుగా ఎదుర్కొనే సామర్థ్యం ఆమెకు అడ్వాంటేజ్ గా చెబుతున్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సొంత ప్రాంతానికి చెందిన అరుణ అన్నిరకాలుగా సీఎం స్పీడుకు బ్రేకులు వేయగలరని చెబుతున్నారు. ఇక ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి దన్నుగా ఉంటున్న అగ్రవర్ణాలలోనూ చీలక తేవడానికి అరుణ నాయకత్వం ఉపయోగపడుతుందనే ఆలోచన చేస్తున్నారని అంటున్నారు. అయితే ఆమెకు దీటుగా బీసీ నేత లక్ష్మణ్ పేరు కూడా ఎక్కువగా వినిపిస్తోందని అంటున్నారు.

# చేదెక్కిన చక్కెర...



ముంబై,దేశంలో పెరుగుతున్న చక్కెర ధరలను నియంత్రించడానికి, రాబోయే పండుగ సీజన్‌లో తగినంత లభ్యతను నిర్ధారించడానికి కేంద్ర ప్రభుత్వం అనేక ముఖ్యమైన చర్యలు తీసుకుంది. ప్రభుత్వం ప్రకారం చక్కెర ధర జూలై 20న కిలోగ్రాముకు రూ..48.18 నుండి ఆగస్టు 20 నాటికి కిలోగ్రాముకు రూ.55.70కి పెరిగింది. ప్రభుత్వం మార్కెట్ పరిస్థితులను నిరంతరం పర్యవేక్షిస్తూ, అనవసరమైన ధరల పెరుగుదల, నిల్వలు, కృత్రిమ కొరతలను నివారించడానికి చర్యలు తీసుకుంటోంది పండగల వేళ 10 లక్షల టన్నుల చక్కెర దిగుమతికి అనుతించింది కేంద్రం. చక్కెర వ్యాపారులకు 400 టన్నుల స్టాక్ లిమిట్‌ను విధించింది. అయితే చక్కెర నిల్వలపై కేంద్రం కఠినంగా వ్యవహరిస్తోంది.ఇటీవలి చక్కెర ధరల పెరుగుదలకు ఇథనాల్ ఉత్పత్తిని నిందించడం సరికాదని ప్రభుత్వం స్పష్టం చేసింది. ఇథనాల్ కోసం మళ్లించే చక్కెర వాటా 2022-23లో సుమారు 12% నుండి 2025-26 నాటికి సుమారు 9%కి తగ్గుతుంది. అంతేకాకుండా, దేశంలో ఉత్పత్తి అయ్యే ఇథనాల్‌లో సుమారు ముప్పావు వంతు ఇప్పుడు ధాన్యాల నుండి, ప్రధానంగా మొక్కజొన్న నుండి ఉత్పత్తి అవుతోంది.ప్రస్తుత చక్కెర ధరల పెరుగుదలకు అనేక కారణాలు ఉన్నాయని ప్రభుత్వం చెబుతోంది. వాటిలో ఊహించిన దానికంటే తక్కువ దేశీయ చక్కెర ఉత్పత్తి, పండుగ సీజన్‌కు ముందు పెరిగిన డిమాండ్, చెరకు పంటకు వాతావరణం వల్ల కలిగిన నష్టం, ప్రపంచవ్యాప్తంగా చక్కెర సరఫరా కొరత, పరిశ్రమలోని కొన్ని వర్గాలలో ఊహాగానాలు, నిల్వలు వంటివి ఉన్నాయి.చెరకు పండించే రాష్ట్రాలు మొదట్లో అంచనా వేసిన సుమారు 343 లక్షల మెట్రిక్ టన్నులతో పోలిస్తే, ప్రస్తుత సీజన్‌లో చక్కెర ఉత్పత్తి సుమారు 306 లక్షల మెట్రిక్ టన్నులుగా ఉంటుందని అంచనా వేసింది. చెరకు పంటలో రెడ్ రాట్, టాప్ బోరర్ తెగుళ్లు, అలాగే అధిక వర్షపాతం వల్ల ఏర్పడిన నీటి నిల్వ కారణంగా ఉత్పత్తి దెబ్బతింది.అంచనా వేసిన దానికంటే ఉత్పత్తి తక్కువగా ఉన్నప్పటికీ, అక్టోబర్‌లో కొత్త క్రషింగ్ సీజన్ ప్రారంభమయ్యే వరకు దేశీయ అవసరాలను తీర్చడానికి దేశంలో తగినంత చక్కెర నిల్వలు అందుబాటులో ఉన్నాయి .ప్రపంచవ్యాప్తంగా కూడా చక్కెర ధరలు పెరుగుతున్నాయి. చక్కెర సరఫరా కొరత అనేది ప్రపంచవ్యాప్త పరిణామం, ఇది భారతదేశానికే పరిమితం కాదు. 2026-27 సంవత్సరానికి ప్రపంచ చక్కెర కొరత సుమారు 33 లక్షల మెట్రిక్ టన్నులుగా అంచనా వేయగా, వాతావరణ పరిస్థితులపై ఆందోళనలు ప్రపంచ దృక్పథాన్ని మరింతగా ప్రభావితం చేశాయి. ఫలితంగా అంతర్జాతీయ చక్కెర ధరలు 30 జూన్ 2026న టన్నుకు వి474 నుండి 20 ఆగస్టు 2026 నాటికి టన్నుకు వి552కు భారీగా పెరిగాయి. రెండు నెలల కన్నా తక్కువ వ్యవధిలోనే 16% పైగా పెరుగుదల నమోదైంది. ఇథనాల్ కార్యక్రమం రైతులకు సహాయపడి, చక్కెర మిల్లులను బలోపేతం చేసింది.భారతదేశం సాధారణంగా సంవత్సరానికి సుమారు 320-340 లక్షల మెట్రిక్ టన్నుల చక్కెరను ఉత్పత్తి చేస్తుంది. అయితే దేశీయ వినియోగం సుమారు 280-290 లక్షల మెట్రిక్ టన్నులుగా ఉంటుంది . ఉత్పత్తి అధికంగా ఉన్న సంవత్సరాలలో, అదనపు నిల్వలు చక్కెర మిల్లుల నిధులను నిలిపివేసి, చెరకు రైతులకు చెల్లింపులను ఆలస్యం చేయగలవు. అదనపు చక్కెరను ఇథనాల్ వైపు మళ్లించడం ఈ నిర్మాణాత్మక సమస్యను పరిష్కరించడంలో సహాయపడి, చక్కెర మిల్లుల ఆర్థిక పరిస్థితిని మెరుగుపరిచింది.ఫలితాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. 2026 ఆగస్టు 20 నాటికి, 2025-26 చక్కెర సీజన్‌కు సంబంధించిన చెరకు బకాయిలలో 97 శాతాన్ని రైతులకు ఇప్పటికే చెల్లించారు. చక్కెర మిల్లుల ఆర్థిక పరిస్థితి మెరుగుపడటంతో, ప్రభుత్వ మద్దతుపై వాటి ఆధారపడటం కూడా తగ్గింది. 2014 నుండి 2021 మధ్య చక్కెర పరిశ్రమకు సుమారు రూ. 14,600 కోట్ల సబ్సిడీని అందించగా, 2021-22 నుండి అటువంటి సబ్సిడీ ఏదీ ప్రకటించబడలేదు. అదే సమయంలో వినియోగదారులకు చక్కెర ధరలు దీర్ఘకాలంలో స్థిరంగా ఉన్నాయి. ఆగస్టు 2024 మరియు జూలై 2026 మధ్య సంవత్సరానికి సుమారు 3% మాత్రమే పెరిగాయి . నిల్వలకు వ్యతిరేకంగా, సరఫరాను పెంచడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది.

# లోకల్ ఎన్నికలు కొంపముంచాతాయా? ఏంటి?

నెల్లూరు, ఆంధ్రప్రదేశ్‌లో త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికలు తెలుగుదేశం పార్టీ ప్రభుత్వానికి ప్రతిష్టాత్మకంతో పాటు ఎంతో సవాల్ గా మారనున్నాయి. అసెంబ్లీ ఎన్నికల్లో ఘన విజయం సాధించిన కూటమి ప్రభుత్వం, ఇప్పుడు గ్రామం నుంచి మున్సిపల్ స్థాయి వరకు పార్టీ యంత్రాగాన్ని బలోపేతం చేయాల్సిన అవసరం ఉంది. కూటమి ప్రభుత్వం ఏర్పాటయి రెండేళ్లు కావస్తుంది. కార్యకర్తల్లో ఎన్నికలకు ముందు ఉత్సాహం లేదు. పదవులు లేవు. వారికి సరైన పనులు దక్కడం లేదు. ఇప్పటికీ అనేక నియోజకవర్గాల్లో వైసీపీ నేతలదే పెత్తనమని కార్యకర్తల నుంచి ద్వితీయ శ్రేణి నేతల వరకూ భావిస్తున్నారు. వీరు స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎంత మేరకు కమిట్ మెంట్ తో పనిచేస్తారన్నది మాత్రం లోలోపల పార్టీ నేతలకు కూడా సందేహంగానే కనిపిస్తుంది.. తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రాకముందు ఒకలా... వచ్చిన తర్వాత మరొకలా వ్యవహరిస్తుంది. గత సాధారణ ఎన్నికల్లో ప్రాణాలకు తెగించి పోలింగ్ కేంద్రాల వద్ద కార్యకర్తలు పోరాడారు. కానీ అధికారంలోకి వచ్చిన తర్వాత మాత్రం పార్టీ కోసం కష్టపడిన కార్యకర్తలను పట్టించుకోవడం లేదు. ముఖ్యంగా పార్టీ అగ్రనాయకత్వం హెచ్చరికలు చేస్తున్నా అత్యధిక సంఖ్యలో ఉన్న టీడీపీ శాసనసభ్యులు తమకు ఆర్థిక ప్రయోజనాలు చేకూర్చే వారికే పనులు కట్టబెడుతున్నారు కానీ, పార్టీ కోసం పనిచేసిన కార్యకర్తల కష్టాన్ని మాత్రం గుర్తించడం లేదన్న అభిప్రాయం ఉంది. అధికారంలోకి వచ్చిన తర్వాత తమకు ఒరిగిన ప్రయోజనమేమీ లేదని బహిరంగంగానే పార్టీ కార్యకర్తలు సోషల్ మీడియా ద్వారా వాపోతున్నారు. కానీ వారి గోడును మాత్రం పట్టించుకోవడం లేదు. కూటమి నేతల మధ్య సయోధ్య లేకపోవడం కూడా మరొక తలనొప్పిగా తయారు కావచ్చు.. మరొకవైపు ఎమ్మెల్యేల అవినీతి, అక్రమాలను కూడా చూసీ చూడనట్లు పార్టీ నాయకత్వం వదిలేస్తుండటాన్ని కార్యకర్తలు ఆగ్రహంతో ఉన్నారు. టీడీపీకి బూత్ లెవెల్ లో భారీ బలగం ఉన్నప్పటికీ స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎంత మేరకు కసి తీరా పనిచేస్తుందన్నది మాత్రం సందేహంగానే ఉంది. మరొకవైపు ప్రత్యక్ష ఎన్నికల విధానం కూడా పార్టీకి నష్టం తెచ్చి పెడుతుందని అంటున్నారు. బీసీ నినాదం ఎత్తుకున్నా అవి న్యాయస్థానాలు ఎంత మేరకు అంగీకరిస్తాయన్నది కూడా అనుమానమే. ఇప్పటికే రిజర్వేషన్లపై హైకోర్టు చేసిన వ్యాఖ్యలు చూస్తే 34 శాతం బీసీ రిజర్వేషన్లతో ఈ ఎన్నికలకు వెళ్లే అవకాశాలు కనిపించడం లే?. స్థానిక సంస్థల్లో 34శాతం బీసీ రిజర్వేషన్ల అమలును ప్రతిష్టాత్మకంగా తీసుకున్నప్పటికీ, న్యాయపరమైన చిక్కులు రాకుండా ఎన్నికలు నిర్వహించడం ప్రభుత్వానికి పెద్ద సవాల్. అయితే 16వ ఆర్థిక సంఘం నిధులను పొందడానికి, సకాలంలో స్థానిక సంస్థల పాలనను పునరుద్ధరించడం కోసం ఎన్నికలు నిర్వహించడం అవసరం. అందుకే స్థానిక సంస్థల ఎన్నికలు టీడీపీకి ఛాలెంజ్ అనే చెప్పాలి.

# ఎప్పుడూ ఆ నియోజకవర్గం రాజకీయమే

అనంతపురం,రాష్ట్రంలో వైసీపీ వర్సెస్ టీడీపీ, జనసేన అనేలా చాలా నియోజకవర్గాలు ఉన్నాయి. కానీ, ఓ నియోజకవర్గంలో మాత్రం 'అంతకుమించి' అన్నట్టుగా ఇరు పక్షాల మధ్య ముఖ్యంగా స్థానిక నేతల మధ్య రాజకీయాలు రగులుతున్నాయి. నానాటికీ ఈ రాజకీయ వ్యూహాలు.. పెరుగుతూనే ఉన్నాయి. అదే...ఉమ్మడి అనంతపురం జిల్లాలోని తాడిపత్రి నియోజకవర్గం. ఇక్కడ జేసీ వర్సెస్ పెద్దారెడ్డి మధ్య రాజకీయాలు నిరంతరం నిప్పులు చెరుగుతూనే ఉన్నాయి ఇతర నియోజకవర్గాల్లోనూ వైసీపీ వర్సెస్ టీడీపీ అన్నట్టుగా రాజకీయాలు ఉన్నప్పటికీ.. ఇక్కడ మరింత భిన్నమైన పరిస్థితి కనిపిస్తోంది. వైసీపీ ఎమ్మెల్యే పెద్దారెడ్డిని నియోజకవర్గంలోకి రాకుండా అడ్డుకుంటామని.. ఆయన నియోజకవర్గంలో అడుగు పెట్టేది కూడా లేదని శపథం చేసిన టీడీపీ సీనియర్ నేత జేసీ ప్రభాకర్‌రెడ్డి అలానే వ్యవహరిస్తున్నారు. గత రెండున్నరేళ్లుగా రాష్ట్రంలో రగులుతున్న ఏకైక నియోజకవ ర్గం కూడా ఇదే కావడం గమనార్హం... నియోజకవర్గంలో అభివృద్ధికి ప్రాధాన్యం ఇవ్వడం ఎక్కడైనా ఉంటుంది. తాడిపత్రిలో మాత్రం రాజకీయాలకు ఇస్తున్న ప్రాధాన్యం వైసీపీ హయాంలోను.. ప్రస్తుత కూటమి హయాంలోనూ అభివృద్ధిని మించి ఉంటోందన్నది ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది. యువ ఎమ్మెల్యే అస్మిత్ రెడ్డి అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తున్నా.. రాజకీయంగా జేసే వేస్తున్న అడుగుల కారణంగా.. అభివృద్ధిపై పెద్దగా చర్చ జరగడం లేదు. గత వైసీపీ దెబ్బతిన్నది కూడా ఇక్కడే. ముందుగా అభివృద్ధిపై ప్రచారం ఎక్కువగా ఉంటే.. అది అల్టిమేట్‌గా పార్టీలకు కలిసి వస్తుంది. అన్నట్టుగా తాడిపత్రి నియోజకవర్గం మారిపోవడం గమనార్హం. సహజంగా ఎన్ని కలకు ముందు రాజకీయాలు ఉంటాయి. కానీ, వైసీపీ వర్సెస్ టీడీపీ మధ్య ముఖ్యంగా మాజీ ఎమ్మెల్యేల మధ్య వ్యక్తిగత అంశాలు ఎక్కువగా ప్రభావం చూపుతున్నాయి. దీనిని ప్రజలు ఎలా రిసీవ్ చేసుకుంటారు? అనే అంశంపైనే తాడిపత్రి నియోజకవర్గం భవిష్యత్తు ఆధారపడి ఉంటుంది. అంతకు మించి.. వ్యక్తిగత దూకుడును ప్రజలు అర్థం చేసుకుంటారా.. లేదా? అనేది చూడాలి. ప్రస్తుతం అయితే.. జేసీ హవా ఓ రేంజ్ లో సాగుతోందన్నది వాస్తవం.

# శ్రావణమాసంతో పూజ వస్తువుల ధర రెట్టింపు

విజయవాడ ,శ్రావణ మాసం వచ్చిందంటే ప్రతి ఇల్లూ కళకళలాడిపోతుంది. పూజలు, వ్రతాలతో లక్ష్మీ కళ ఉట్టిపడుతుంది.హిందువులకు శ్రావణ మాసం వచ్చిందంటే పండగ వాతావరణమే. మహిళలు తాము ముస్తాబవ్వడమే కాకుండా ఇంటిని కూడా చూడచక్కని విధంగా అలంకరిస్తారు. దాంతో ప్రతి శుభకార్యంలో తప్పక కావాల్సిన తమలపాకు ధరకు రెక్కలు వచ్చాయి. ప్రతీ తాంబూలంలోనూ తమలపాకే ముఖ్యం. తమలపాకు లేనిదే ఏ శుభకార్యం కూడా జరగదు. దాంతో తమలపాకుతో పాటు అరటిపళ్లు, కొబ్బరి కాయలు, పూల రేట్లకు రెక్కలు వచ్చాయి.రాష్ట్రంలో ఎక్కువగా ఉన్న చింతలపూడి, మాచవరం, ములుకుదురు ప్రాంతాల్లో తమలపాకు తోటలు ఉన్నాయి. రైతు వద్ద తక్కువకే కొనుగోలు చేస్తున్న వ్యాపారులు.. తమ కొట్లల్లో మాత్రం భారీగా అమ్మేస్తున్నారు. ఎందుకంటే పండగ సీజన్‌లో తమలపాకుకు ఉన్న డిమాండ్ అలాంటిది. రైతు వద్ద 150 ఆకుల కట్టను రూ. 16కు కొనుగోలు చేస్తున్న వ్యాపారులు.. విడిగా ప్రజలకు మాత్రం ఒక్కొక్కటి రూపాయి చొప్పున విక్రయిస్తున్నారు. మంగళగిరి ప్రాంతంలో అయితే 30 ఆకులను రూ. 50 వరకు వసూలు చేస్తున్నారు.తమలపాకుతో పాటు కొబ్బరి కాయలు కూడా భారీగా పెరిగాయి. శ్రావణ మాసానికి ముందు కొబ్బరి కాయ సైజును బట్టి రూ. 15 నుంచి రూ. 35 మధ్య అమ్మేవారు. ప్రస్తుతం మీడియం సైజు కాయ ధరే రూ. 50 ఉంది. అరటి పళ్లు కూడా గతంలో డజను రూ. 40 నుంచి రూ. 60 వరకు అమ్మేవారు. ఇప్పుడు అదే అరటి కాయ ప్రాంతాన్ని బట్టి పెరిగిపోయింది. యావరేజ్‌గా రూ. 80 నుంచి రూ. 100 వరకు అమ్మేస్తున్నారు.వర్షాభావ పరిస్థితుల్లో పూలకు మంచి డిమాండ్

# బీజేపీ ఉచ్చులోనే కాంగ్రెస్...

న్యూఢిల్లీ,రాజకీయాలలో అత్యంత ప్రమాదకరమైన విషయం ప్రత్యర్థి చూపించే దారిలో ప్రయాణించడం. శత్రువు విసిరిన వ్యూహంలో చిక్కుకుని, అతను నిర్దేశించిన మైదానంలోనే పోరాడటానికి సిద్ధపడటం ఆత్మహత్యాసదృశం !"కాంగ్రెస్ పార్టీ గత పన్నెండేళ్లుగా ఇదే చేస్తోంది. ఇప్పటికీ తెలుసుకోలేకపోతోంది. రాజకీయం అనేది ఎవరూ ప్రత్యేకంగా నేర్పే విద్య కాదు. మారుతున్న పరిణామాలను గ్రహించి, ప్రత్యర్థి వేసే ఎత్తులకు పైఎత్తులు వేస్తూ సమాజంలోని అన్ని వర్గాలను తమవైపు తిప్పుకోవడమే ప్రజాస్వామ్యంలో ఏ రాజకీయ పార్టీకైనా ప్రాణాధారం. కానీ, దేశాన్ని దశాబ్దాల పాటు ఏలిన భారత జాతీయ కాంగ్రెస్ పార్టీకి నేడు ఆ ప్రాథమిక రాజకీయం కూడా చేతకావడం లేదనేది బహిరంగ రహస్యంగా మారింది. ఒకవైపు స్పష్టమైన హిందుత్వ పోలరైజేషన్‌తో ముందుకు వెళ్తున్న భారతీయ జనతా పార్టీ , మరోవైపు కాంగ్రెస్‌ను కేవలం ముస్లింల పార్టీగా చిత్రించే వ్యూహాన్ని అత్యంత ప్రతిభావంతంగా అమలు చేస్తోంది. ఈ విషయం తెలిసి కూడా కాంగ్రెస్ నాయకత్వం ప్రతిసారీ బీజేపీ వేస్తున్న ఆ రాజకీయ ట్రాప్‌లోనే పడిపోతూ తన ఓటు బ్యాంకును, ఉనికిని కోల్పోతోంది.పోటీ ప్రపంచంలో ప్రత్యర్థి వేసే ముల్లును అదే ముల్లుతో తీయాలి తప్ప, ఆ ముల్లుపైనే అడుగులేస్తూ వెళ్లడం వివేకం అనిపించుకోదు. బీజేపీ తనపై వేస్తున్న ముస్లిం లీగ్ తరహా భావజాల ముద్రను సమర్థవంతంగా తిప్పి కొట్టలేకపోతే, రాబోయే రోజుల్లో మిగిలిన కొద్దిపాటి ప్రాతినిధ్యాన్ని కూడా కోల్పోయే ప్రమాదం స్పష్టంగా కనిపిస్తోంది. కేవలం మేధోపరమైన వ్యూహాల పేరుతో సాధారణ ప్రజల ప్రాథమిక ఆకాంక్షలకు, జాతీయ భావనలకు దూరంగా జరిగే కొద్దీ కాంగ్రెస్ తన సాంప్రదాయ ఓటు బ్యాంకును మరింత వేగంగా కోల్పోతూనే ఉంటుంది.ఇటీవలి ఎన్నికల విశ్లేషణల ప్రకారం కాంగ్రెస్ సాధిస్తున్న మెజారిటీ విజయాలు, ఓట్లు ఎక్కువగా వచ్చే ప్రాంతాలు మైనారిటీ జనాభా ఉన్నవే. బీజేపీ చేస్తున్న పోలరైజేషన్ ట్రాప్‌లో కాంగ్రెస్ నేరుగా వెళ్లి చిక్కుకోవడానికి నిదర్శనంగా వందేమాతరం' జాతీయ గేయం చుట్టూ జరుగుతున్న వివాదం నిలిచింది. రవీంద్రనాథ్ ఠాగూర్, మహాత్మా గాంధీలు నాటి రోజుల్లో సూచించిన అంశాలను సరికొత్త రాజకీయ పరిస్థితులకు అనుగుణంగా రీ-ఫ్రేమ్ చేసుకోవడంలో కాంగ్రెస్ విఫలం అయింది. ప్రత్యర్థి విసిరిన భావజాల ఎరలో పడి, తన సార్వజనీన జాతీయ ప్రతిష్ఠను కోల్పోతూ మైనారిటీల తుది శరణాలయంగా మాత్రమే మిగిలిపోయేలా కాంగ్రెస్ స్వయంకృత అపరాధం చేస్తోంది. గతం నుంచి పాఠాలు నేర్చుకోకుండా ఆనాటి పొరపాట్లనే మళ్లీ పునరావృతం చేయడం వల్ల, కాంగ్రెస్ పార్టీ భారతీయ ప్రజాస్వామ్యంలో తన ప్రధాన ప్రత్యామ్నాయ శక్తిననే హోదాను మరింత వేగంగా కోల్పోతోంది. భారత రాజకీయాల్లో నరేంద్ర మోదీ, అమిత్ షాల నాయకత్వంలో బీజేపీ అమలు చేసిన సామాజిక సమీకరణాల వ్యూహం అపూర్వమైన విజయాన్ని సాధించింది. దేశాన్ని దశాబ్దాల పాటు ఏకఛత్రాధిపత్యంగా ఏలిన కాంగ్రెస్ నిర్మించుకున్న సామాజిక పునాదిని ఈ వ్యూహం క్రమంగా, శాశ్వతంగా ధ్వంసం చేసింది. ఒకప్పుడు సమాజంలోని అన్ని వర్గాలను తన గొడుగు కిందకు తెచ్చుకున్న కాంగ్రెస్, నేడు తన సాంప్రదాయ ఓటు బ్యాంకులను ఒకటొకటిగా కోల్పోతూ తీవ్ర రాజకీయ సంక్షోభంలో కూరుకుపోయింది. చారిత్రకంగా కాంగ్రెస్‌కు వెన్నుదన్నుగా నిలిచిన ఉన్నత వర్గాలు, పట్టణ మధ్యతరగతి ప్రజలను బీజేపీ అత్యంత చతురతతో తనవైపు తిప్పుకుంది. బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య సామాజిక వర్గాలతో పాటు వేగంగా ఎదుగుతున్న ఉపాధి ఆధారిత పట్టణ సమాజంలో సుపారిపాలన, ఆర్థిక వృద్ధి, సాంస్కృతిక జాతీయవాదం అనే నినాదాలతో బీజేపీ గట్టి నమ్మకాన్ని నింపింది. కాంగ్రెస్ ప్రతిపాదించే సెక్యులరిజం కేవలం కొన్ని వర్గాలను సంతృప్తి పరచడానికే పరిమితమైందనే భావనను బలంగా ప్రచారం చేయడంలో అధికార పక్షం విజయం సాధించగా, ఈ నిర్ణయాత్మక ఓటు బ్యాంకు కాంగ్రెస్ చేజారి బీజేపీకి శాశ్వత బలగంగా మారింది.కాంగ్రెస్ విధానాల పట్ల తీవ్ర అసంతృప్తితో ఉన్న ఓబీసీలు, అత్యంత వెనుకబడిన వర్గాలను చేరదీయడం బీజేపీ వేసిన అతిపెద్ద వ్యూహాత్మక ఎత్తుగడ. ప్రాంతీయ పార్టీల ఆధిపత్యం, కాంగ్రెస్ ఆత్మరక్షణ వైఖరి వల్ల నిర్లక్ష్యానికి గురైన నాన్-యాదవ్ ఓబీసీలు, చిన్న చిన్న వెనుకబడిన కులాలకు రాజకీయ ప్రాతినిధ్యంతో పాటు సంక్షేమ పథకాల్లో ప్రాధాన్యం కల్పించారు. సంస్థాగత పదవుల నుంచి చట్టసభల



టికెట్ల వరకు ఈ వర్గాలకు తగిన స్థానం ఇవ్వడం ద్వారా, కాంగ్రెస్ కేవలం కొన్ని కుటుంబాలు లేదా నాయకులకే పరిమితమైందనే విమర్శను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లగలిగారు. సాంప్రదాయకంగా కాంగ్రెస్ శాశ్వత ఓటు బ్యాంకుగా పరిగణించే దళిత , గిరిజన వర్గాల్లోనూ బీజేపీ పట్టు సాధిస్తోంది. సాంస్కృతిక జాతీయవాదం, స్థానిక గిరిజన పోరాట యోధులకు గుర్తింపు ఇవ్వడం , పిఎం ఆవాస్, ఉజ్వల వంటి సంక్షేమ పథకాల లబ్ధిదారుల నమూనా ద్వారా ఈ వర్గాల జీవన ప్రమాణాల్లో మార్పు తెచ్చింది. ఇటీవలి సార్వత్రిక ఎన్నికల ఫలితాలు, పలు రాష్ట్రాల అసెంబ్లీ ఫలితాలను నిశితంగా విశ్లేషిస్తే ఒక రకమైన మైనారిటీ క్లస్టర్ పార్టీగా పరిమితమవుతోందనే వాదన బలపడుతోంది. కాంగ్రెస్ తరఫున విజయం సాధిస్తున్న పార్లమెంటు, అసెంబ్లీ ప్రజాప్రతినిధుల్లో అత్యధికులు ముస్లిం లేదా క్రైస్తవ జనాభా గణనీయంగా ఉండే ప్రాంతాల నుంచే వస్తున్నారని స్పష్టమవుతోంది. ఉత్తర భారతదేశంతో పాటు దక్షిణాదిలోని కొన్ని పాకెట్లలో ముస్లిం సాంద్రత ఎక్కువగా ఉన్న స్థానాల్లోనే కాంగ్రెస్ మెరుగైన ఓటు షేర్‌ను, సీట్లను సాధించగలుగుతోంది. దీనికి భిన్నంగా, మెజారిటీ సామాజిక వర్గాలు , ఇతర వెనుకబడిన తరగతులు ఎక్కువగా ఉండే నియోజకవర్గాల్లో కాంగ్రెస్ రోజురోజుకూ తన పట్టును కోల్పోతోంది. అనేక ప్రాంతాల్లో ఆ పార్టీ మూడో స్థానానికి పడిపోవడం లేదా ప్రాంతీయ పార్టీలు, బిజెపిలతో పోలిస్తే ఉనికికే పరిమితమైన పరిస్థితి కనిపిస్తోంది. ఇది కేవలం ఎన్నికల ఓటములతో ఆగిపోకుండా, కాంగ్రెస్ అంటే కేవలం మైనారిటీల ప్రయోజనాలనే పరిరక్షించే పార్టీ అనే రాజకీయ నిందకు బలం చేకూరుస్తోంది. బిజెపి తన సార్వత్రిక ప్రచారాల్లో ఈ అంశాన్ని వ్యూహాత్మకంగా ఉపయోగించుకుంటూ, కాంగ్రెస్‌పై ముస్లింల పార్టీ ముద్ర వేసి మెజారిటీ వర్గాలను తనవైపు సమీకరించుకోవడంలో సఫలమవుతోంది. ఒక వైపు తన సాంప్రదాయక హిందూ ఓటు బ్యాంకును పునర్నిర్మించుకోవడంలో విఫలమవడం, మరోవైపు మైనారిటీ ఏకీకరణపైనే పూర్తి స్థాయిలో ఆధారపడాల్సి రావడం వల్ల పార్టీ జాతీయ ప్రతిష్ఠ దెబ్బతింటోంది.ఒకప్పుడు రాజకీయం అంటే తాము నిర్దేశించిన గీతే అనే ధీమా కాంగ్రెస్‌లో బలంగా ఉండేది. ప్రత్యర్థుల ఉనికి నామమాత్రంగా ఉన్న నాటి వాతావరణంలో వరుస విజయాలు ఆ పార్టీకి నల్లపూసలా మారాయి. కానీ ఆరెస్సెస్ అందించే క్షేత్రస్థాయి శ్రేణుల బలం, బీజేపీ సమకూర్చుకున్న ఆధునిక సాంకేతిక, వ్యూహాత్మక బలగాలు ఏకం కావడంతో భారత రాజకీయ చదరంగం రూపురేఖలే మారిపోయాయి. తమ ఓటు బ్యాంకు ఒక్కొక్కటిగా కరిగిపోతున్నా, మార్పును గుర్తించి సరైన ఆత్మపరిశీలన చేసుకోకుండా కాంగ్రెస్ భావజాలపరంగా వరుస స్వయంకృత అపరాధాలు చేస్తూనే ఉంది. సమాజంలో హిందుత్వ వర్సెస్ సెక్యులరిజం భావజాల చర్చ ముందుకు వచ్చిన ప్రతీసారీ, సాధారణ ప్రజామోదం పొందే రీతిలో సమర్థవంతమైన సమాధానం చెప్పడంలో కాంగ్రెస్ తీవ్రంగా తడబడుతోంది ప్రత్యర్థులు లేని హాయిగా గడిచిన గతం ముగిసిపోయిందనే వాస్తవాన్ని కాంగ్రెస్ నాయకత్వం ఇప్పటికైనా గ్రహించాల్సి ఉంది. కేవలం పాత జ్ఞాపకాలనో, దశాబ్దాల నాటి తీర్మానాలనో పట్టుకుని వేలాడటం వల్ల మారుతున్న నేటి యువ భారత్ ఆకాంక్షలను అందుకోవడం అసాధ్యం. బీజేపీ విసురుతున్న రాజకీయ, భావజాల సవాళ్లను తిప్పికొట్టాలంటే కాంగ్రెస్‌కు డిఫెన్సివ్ వైఖరి కాదు, స్పష్టమైన భావజాల పునర్నిర్మాణం , సమగ్రమైన క్షేత్రస్థాయి ఆత్మపరిశీలన అవసరం. కానీ ఆ దిశగా కాంగ్రెస్ ఇప్పటికీ మేలుకోలేదు.

# లోకల్ పోల్స్ కోసం జనసేన ప్లాన్



విజయవాడ,ఆంధ్రప్రదేశ్‌లో త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి జనసేన అధినేత, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పార్టీ నాయకత్వానికి, ఎమ్మెల్యేలకు అత్యంత స్పష్టమైన దిశానిర్దేశం చేశారు. మంగళగిరిలోని జనసేన పార్టీ కేంద్ర కార్యాలయంలో జరిగిన జనసేన లెజిస్లేటివ్ పార్టీ సమావేశంలో పాల్గొన్న ఆయన, స్థానిక ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహంపై కీలక వ్యాఖ్యలు చేశారు. 2024 సార్వత్రిక ఎన్నికల్లో 21 అసెంబ్లీ స్థానాలకే పరిమితమైన వ్యూహం కేవలం ఆ ఎన్నికలకే వర్తిస్తుందని, స్థానిక సంస్థల ఎన్నికల్లో మాత్రం అదే ఫార్ములా ఉండబోదని తేల్చిచెప్పారు. ప్రాంతాలవారీ రాజకీయ, సామాజిక సమీకరణాల ఆధారంగా జనసేన వ్యూహం స్వతంత్రంగా, ప్రభావశీలంగా ఉంటుందని స్పష్టం చేశారు.ఐదేళ్ల పాటు పార్టీ కోసం ప్రాణాలకు తెగించి పోరాడిన జనసైనికులు, వీర మహిళల ఆత్మగౌరవాన్ని కాపాడేలా రాబోయే స్థానిక ఎన్నికల్లో అడుగులు వేయాలని పవన్ పిలుపునిచ్చారు. 2021 స్థానిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అరాచకాలను ఎదిరించి జనసేన కార్యకర్తలు ధైర్యంగా నిలబడ్డ విషయాన్ని, అలాగే 2024 సార్వత్రిక ఎన్నికల్లో కూటమి చారిత్రాత్మక విజయానికి క్షేత్రస్థాయిలో పార్టీ శ్రేణులు చేసిన అసమాన కృషిని ఈ సందర్భంగా కొనియాడారు. పార్టీ కోసం నిలబడిన ప్రతి కార్యకర్త రాజకీయ బలోపేతమే లక్ష్యంగా స్థానిక సంస్థల ఎన్నికల్లో జనసేనకు మెరుగైన అవకాశాలు కల్పించేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు వెల్లడించారు.స్థానిక ఎన్నికల విధివిధానాల రూపకల్పన కోసం 9 నుంచి 11 మంది ఎమ్మెల్యేలు, సీనియర్ నేతలతో కూడిన ఒక ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేయనున్నట్లు అధినేత ప్రకటించారు. నియోజకవర్గాల వారీగా క్షేత్రస్థాయి పరిస్థితులను అంచనా వేసి, జనసేన పోటీ చేయడానికి తగిన స్థానాలు, పట్టున్న ప్రాంతాలను గుర్తించి సమగ్ర నివేదిక ఇవ్వాలని ఎమ్మెల్యేలను ఆదేశించారు. క్షేత్రస్థాయిలో జనసేన శ్రేణుల మనోభావాలు, స్థానిక రాజకీయ వాతావరణాన్ని పరిగణనలోకి తీసుకున్న తర్వాతే సీట్ల కేటాయింపు, అభ్యర్థుల ఎంపికపై నిర్ణయాలు ఉంటాయని తెలిపారు.ఇదే సమయంలో కొన్ని ప్రాంతాల్లో క్షేత్రస్థాయిలో కూటమి ధర్మానికి భిన్నంగా జరుగుతున్న పరిణామాలు, జనసేన శ్రేణుల అసంతృప్తిపై సమావేశంలో ఎమ్మెల్యేలు పార్టీ చీఫ్ దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై సానుకూలంగా స్పందించిన పవన్.. కార్యకర్తల మనోభావాలు, అభిప్రాయాలను తప్పనిసరిగా పరిగణనలోకి తీసుకుంటామని హామీ ఇచ్చారు. కూటమి ఐక్యతను కాపాడుకుంటూనే, జనసేన బలం ఉన్న ప్రతిచోటా గౌరవప్రదమైన ప్రాతినిధ్యం దక్కేలా చూస్తామని, రాబోయే స్థానిక ఎన్నికల్లో జనసేన తన సత్తా చాటుతుందని పార్టీ శ్రేణుల్లో నూతనోత్సాహాన్ని నింపారు.

జనసేన కేడర లో కొత్త జోష్

జనసేన అధినేత పవన్ కల్యాణ్ స్థానిక సంస్థల ఎన్నికలపై ఫోకస్ పెట్టారు. ఈసారి రాజీ పడకూడదని నిర్ణయించుకున్నట్లు ఆయన మాటలను బట్టి తెలుస్తోంది. కూటమిలో పొత్తుకు భంగం కలగకుండా, తమకు నష్టం జరగకుండా స్థానాలను తీసుకోవాలని పవన్ కల్యాణ్ నిర్ణయించుకున్నట్లు పార్టీ నేతలు చెబుతున్నారు. ఇదే అభిప్రాయాన్ని త్వరలో చంద్రబాబు నాయుడు ముందు కూడా ఉంచనున్నారు. శాసనసభ ఎన్నికల తరహాలో తమ పార్టీకి తక్కువ స్థానాలు ఇవ్వాలన్న ఆలోచన ఉంటే వాటిని సరిచేసుకోవాలని పవన్ కల్యాణ్ సూచించనున్నారు. ఈ మేరకు జనసేన పార్టీ ఎమ్మెల్యేలకు పవన్ కల్యాణ్ స్పష్టమైన సంకేతాలు ఇచ్చారు. 21 స్థానాల్లో పోటీ చేయడం అనేది అప్పటి పరిస్థితుల వరకే.. స్థానిక సంస్థల ఎన్నికల్లో సార్వత్రిక ఎన్నికల వ్యూహం వర్తించదు.. జనసైనికులు, వీర మహిళల ఆత్మగౌరవం కాపాడుతామని పవన్ కల్యాణ్ అనడం చర్చనీయాంశమైంది.. త్వరలోనే కమిటీలను నియమించి పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేయాలని కూడా పవన్ నిర్ణయించారు. జనసేన శాసనసభ పక్ష సమావేశంలో పవన్ కల్యాణ్ ఈ వ్యాఖ్యలు చేశారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలపై లోతుగా చర్చించామని పవన్ కల్యాణ్ తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో జనసైనికుల పోరాట స్ఫూర్తిని కొనసాగించేలా, వారి ఆత్మగౌరవాన్ని నిలబెట్టేలా ముందుకు తీసుకువెళ్తామని పవన్ కల్యాణ్ ఎమ్మెల్యేలకు చెప్పారు. నేడు కేరళం కు ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ వెళ్లనున్నారు. నేటి నుంచి 20 రోజులపాటు కేరళంలోని ప్రకృతి వైద్య చికిత్సా కేంద్రంలో ఉండనున్న పవన్ చికిత్స చేయించుకోనున్నారు. తరచూ అనారోగ్యానికి గురవుతున్న పవన్ కల్యాణ్ 20 రోజుల పాటు వైద్య శిబిరంలో పవన్ కల్యాణ్ చికిత్సను చేయించుకోనున్నారు. కేరళం నుంచి వచ్చిన వెంటనే చంద్రబాబుతో సమావేశమై స్థానిక సంస్థల ఎన్నికల్లో సీట్ల సర్దుబాటుపై చర్చించనున్నారు. జనసేనకు స్థానిక సంస్థల ఎన్నికల్లో ముప్ఫయి శాతం స్థానాలను దక్కేలా అవసరమైతే టీడీపీ పై వత్తిడి తేవాలని కూడా నిర్ణయించుకున్నారు. గత కొంతకాలంగా పవన్ కల్యాణ్ ముఖ్యమైన సమావేశాలకు దూరంగా ఉంటున్నారు. రాజధాని అమరావతిలో సీడ్ యాక్సెస్ ప్రారంభోత్సవానికి రాలేదు. మంత్రి వర్గ సమావేశానికి రాలేదు. అసెంబ్లీ సమావేశాలకు చివరి రోజు హాజరై తన శాఖకు చెందిన బిల్లులు

# మళ్లా పెరుగుతున్న బంగారం ధరలు

ముంబై,బంగారం, వెండి ధరలు ఇంటర్నేషనల్ మార్కెట్లో మళ్లీ భారీగా పెరుగుతున్నాయి. దీంతో దేశీయంగా కూడా మళ్లీ గోల్డ్, సిల్వర్ రేట్లు ఎగబాకుతున్నాయి. గత 10 రోజుల వ్యవధిలో కేవలం ఒక్క రోజు మాత్రమే బంగారం ధర తగ్గింది. మిగతా అన్ని రోజులు భారీగా పెరుగుతూ పోయింది. ఈ క్రమంలో దాదాపు రూ. 6-7 వేల వరకు రేటు పెరిగిందని చెప్పొచ్చు. ఇంటర్నేషనల్ మార్కెట్లో ప్రస్తుతం స్పాట్ పసిడి రేటు ఔన్సుకు 4600 డాలర్ల మార్కు దాటి ట్రేడవుతోంది. సిల్వర్ ధర 69 డాలర్ల మార్కు వద్ద ఉంది. ఇక డాలరుతో పోలిస్తే రూపాయి మారకం విలువ ప్రస్తుతం రూ. 95.73 వద్ద కొనసాగుతోంది. దేశ రాజధాని దిల్లీలో ప్రస్తుతం 22 క్యారెట్ల గోల్డ్ రేటు రూ. 1,47,250 వద్ద ఉండగా, 24 క్యారెట్ల పుత్తడి ధర రూ. 1,60,630 వద్ద ఉంది. చెన్నై, ముంబై, బెంగళూరు, కోల్‌కతాల్లో 22 క్యారెట్లు, 24 క్యారెట్ల పసిడి ధర వరుసగా రూ. 147100, రూ. 160480 వద్ద ట్రేడవుతోంది.అంతర్జాతీయ మార్కెట్ ధరలకు అనుగుణంగా దేశీయంగా కూడా గోల్డ్, సిల్వర్ రేట్లు పెరుగుతున్నాయి. ప్రస్తుతం ఆగస్ట్ 22న ఉదయం 7.30 గంటల సమయంలో హైదరాబాద్ నగరంలో 22 క్యారెట్ల గోల్డ్ రేటు రూ. 1100 పెరిగి తులం రూ. 1,47,100 వద్ద ఉంది. 24 క్యారెట్ల స్వచ్ఛమైన బంగారం ధర రూ. 1210 పెరగడంతో 10 గ్రాములకు రూ. 1,60,480 వద్ద ఉంది.మరోవైపు హైదరాబాద్ మార్కెట్‌లో సిల్వర్ రేటు ఆగస్ట్ 22న రూ. 5 వేలు పెరిగింది. దీంతో ప్రస్తుతం కేజీకి రూ. 2.65 లక్షల వద్ద ఉంది. ముందటి రోజు వెండి ధర ఏకంగా రూ. 10 వేలు పెరగ్గా, దానికి ముందు మాత్రం రూ. 5 వేలు పడిపోయింది. ఇక గత 2 రోజుల వ్యవధిలో చూస్తే సిల్వర్ రేటు రూ. 15 వేలు ఎగబాకింది.ఇక ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ప్రధాన నగరాల్లో కూడా గోల్డ్, సిల్వర్ రేట్లు పెరిగాయి. అమరావతి, విశాఖపట్నం, గుంటూరు, విజయవాడలో 22 క్యారెట్ల గోల్డ్ ధర రూ. 147100 వద్ద ఉండగా, 24 క్యారెట్ల మేలిమి బంగారం ధర రూ. 160480 వద్ద ఉంది.ఇటీవల యూఎస్ డాలర్, బాండ్ ఈల్డ్స్ డిమాండ్ పెరగడంతో బంగారం ధరలు తగ్గుముఖం పట్టాయి. ఇప్పుడు మాత్రం అవి వరుసగా గరిష్ఠ స్థాయిల నుంచి దిగొస్తుండగా, గ్లోబల్ మార్కెట్లో బంగారం, వెండి రేట్లు పుంజుకుంటున్నాయి. దీంతో ఇంటర్నేషనల్ మార్కెట్ ధరలకు అనుగుణంగానే దేశీయంగా కూడా రేట్లు పుంజుకుంటున్నాయి.

భారతదేశంలో ఏయే అంశాలు బంగారం ధరల్ని ప్రభావితం చేస్తాయి? నేరుగా అంతర్జాతీయ మార్కెట్ బంగారం ధరలు, దేశీయంగా నేరుగా ప్రభావం చూపిస్తాయి. అక్కడ పెరిగితే ఇక్కడా పెరుగుతాయి. అక్కడ తగ్గితే ఇక్కడా తగ్గుతాయి. ఇంకా ద్రవ్యోల్బణం, రూపాయి విలువ హెచ్చుతగ్గులు, ఫెడ్ వడ్డీ రేట్లు, ఇతర కేంద్ర బ్యాంకుల నిర్ణయాలు, ప్రభుత్వాలు విధించే సుంకాలు బంగారం, వెండి ధరల్ని ప్రభావితం చేస్తుంటాయి.

# తిరుమల అడవుల్లో రోబోట్ నిఘా

తిరుపతి,తిరుమల కొండల్లో భక్తుల భద్రతకు మరింత ప్రాధాన్యం ఇస్తూ టీటీడీ సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుంటోంది. అటవీ ప్రాంతాల్లో వన్యప్రాణుల కదలికలను ముందుగానే గుర్తించి, ప్రమాదం ఏర్పడే అవకాశాలను తగ్గించేందుకు ఆధునిక రోబోట్‌ను ఉపయోగించే అవకాశాలను పరిశీలిస్తోంది. ముఖ్యంగా మనుషులు వెళ్లడం కష్టంగా ఉండే ప్రాంతాల్లో ఈ పరికరం ద్వారా నిఘా పెట్టడం వల్ల అటవీ, భద్రతా సిబ్బందికి ఉపయోగకరంగా ఉంటుందని అధికారులు భావిస్తున్నారు.ఈ నేపథ్యంలో టీటీడీ అదనపు ఈవో సి.హెచ్. వెంకయ్య చౌదరి పద్మావతి అతిథిగృహం వద్ద రోబోట్ డాగ్ పనితీరును పరిశీలించారు. సంబంధిత అధికారులతో కలిసి దాని సామర్థ్యాలను తెలుసుకున్నారు. అడవుల్లో చిరుతలు, ఇతర జంతువుల సంచారం ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో దీనిని ఎలా వినియోగించవచ్చనే అంశంపై వివరాలు సేకరించారు. భక్తులు ప్రయాణించే మార్గాలకు సమీపంలో నిఘా వ్యవస్థను మరింత బలోపేతం చేయడంలో ఇది ఎంతవరకు సహాయపడుతుందనే దానిపై కూడా చర్చించారు.ఈ నాలుగు కాళ్ల రోబోట్‌లో అనేక ఆధునిక పరికరాలు ఉన్నాయి. సాధారణ కెమెరాతో పాటు థర్మల్ ఇమేజింగ్ కెమెరా, 360 డిగ్రీల లైడార్, వివిధ రకాల సెన్సార్లు ఇందులో అమర్చారు. కృత్రిమ మేధ సాంకేతికతను కూడా ఉపయోగిస్తున్నారు. దీంతో వెలుతురు తక్కువగా ఉన్న సమయంలోనూ పరిసరాలను పరిశీలించే అవకాశం ఉంటుంది. పొగమంచు లేదా చీకటి వంటి పరిస్థితుల్లో కూడా కదులుతున్న జీవులు, మనుషులు, వాహనాలను గుర్తించేందుకు ఈ వ్యవస్థ ఉపయోగపడుతుంది.రోబోట్ సేకరించే సమాచారాన్ని కృత్రిమ మేధ ద్వారా విశ్లేషించి వివిధ వస్తువులు, జీవులను ప్రత్యేకంగా గుర్తించేలా రూపొందించారు. ఉదాహరణకు పెద్ద జంతువు కనిపిస్తే దాన్ని మనిషి లేదా వాహనంతో కలిపి చూడకుండా ప్రత్యేకంగా గుర్తించే సామర్థ్యం ఉంటుంది. ప్రమాదకరమైన ప్రాంతంలో వన్యప్రాణి కదలిక గుర్తించినప్పుడు దాని స్థానాన్ని ఆధారంగా చేసుకుని సంబంధిత సిబ్బందికి హెచ్చరికలు పంపే విధానాన్ని కూడా పరిశీలిస్తున్నారు.అలిపిరి నుంచి తిరుమలకు వెళ్లే కాలిబాటకు ఆనుకుని ఉన్న అటవీ ప్రాంతాల్లో ఈ సాంకేతికత ప్రత్యేకంగా ఉపయోగపడే అవకాశం ఉంది. ఈ మార్గంలో భక్తుల రాకపోకలు ఎక్కువగా ఉండటంతో వన్యప్రాణుల సంచారంపై ముందస్తు సమాచారం ఉంటే అప్రమత్త చర్యలు తీసుకోవచ్చు. అవసరమైతే భక్తులను సురక్షిత ప్రాంతాలకు మళ్లించడం, గస్తీ బృందాలను వెంటనే పంపడం వంటి చర్యలకు అవకాశం ఉంటుంది.అంతేకాకుండా రోబోట్ ద్వారా లభించే వీడియోలు, థర్మల్ దృశ్యాలు, ఇతర సమాచారాన్ని భద్రపరచి విశ్లేషిస్తే వన్యప్రాణులు ఏ ప్రాంతాల్లో, ఏ సమయాల్లో ఎక్కువగా సంచరిస్తున్నాయో తెలుసుకోవచ్చు. ఈ వివరాల ఆధారంగా అటవీ, విజిలెన్స్, భద్రతా విభాగాలు తమ గస్తీని మరింత సమర్థంగా నిర్వహించగలవు. భక్తుల రక్షణతో పాటు సిబ్బంది ప్రాణాలకు ప్రమాదం తగ్గించడం కూడా ఈ విధానం ద్వారా సాధ్యమవుతుందని అధికారులు భావిస్తున్నారు.తిరుమల వంటి సున్నితమైన అటవీ ప్రాంతంలో సంప్రదాయ నిఘాకు ఆధునిక సాంకేతికతను జోడించడం ద్వారా భద్రతా వ్యవస్థను మరింత బలోపేతం చేసే దిశగా టీటీడీ ముందడుగు వేస్తోంది. ఈ ప్రయోగం విజయవంతమైతే భవిష్యత్తులో మరిన్ని ప్రాంతాల్లో ఇలాంటి రోబోటిక్ నిఘా వ్యవస్థలను వినియోగించే అవకాశం ఉంది.

# పోక్సో చట్టంపై అవగాహన కలిగి ఉండాలి

ధవలేశ్వరం. మహిళలు, చిన్నారులకు పోక్సో చట్టంపై అవగాహన కలిగి ఉండాలని ప్రిన్సిపల్ సివిల్ జడ్జ్, ప్రిన్సిపల్ మెజిస్ట్రేట్ ఆఫ్ జువెనల్ జస్టిస్ బోర్డ్, రాజమహేంద్రవరం మెజిస్ట్రేట్ ఎన్. రెడ్డి ప్రసన్న, ధవలేశ్వరం ఎస్సై బి హరిబాబు తెలిపారు. రాజమండ్రి రూరల్ నియోజకవర్గం ధవలేశ్వరం పోలీస్ స్టేషన్ పరిధి కలెక్టరేట్ వెనక గల డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ గురుకుల పాఠశాల, ప్రభుత్వ గిరిజన సంక్షేమ బాలికోన్నత పాఠశాలలో బాలికలకు బాలల చట్టాలు, పోక్సో యాక్ట్, ఇతర చట్టాలుపై అవగాహన, చదువుకునే దశలో పిల్లలు పాటించవలసిన నియమాలు, అపరిచిత వ్యక్తులతో పిల్లలు ప్రవర్తించవలసిన తీరు, ఈవ్‌టీజింగ్, గంజాయి వినియోగం వల్ల కలిగే దుష్ప్రభావాలపై అవగాహనతో పాటు పీర్ ప్రెజర్‌కు లోనుకాకుండా చెడు అలవాట్లకు దూరంగా ఉండి, చిన్నారుల భద్రత, వ్యక్తిగత పరిశుభ్రత, మానసిక ఆరోగ్యం వంటి పలు

# బీజేపీ సీనియర్ ఎమ్మెల్యే అసంతృప్తి నిజమేనా?



అమరావతి,ఏపీలో బీజేపీకి ఎన్నడూ లేని విధంగా ఎనిమిది మంది ఎమ్మెల్యేలు 2024 ఎన్నికల్లో గెలిచారు. పది సీట్లు పొత్తులో భాగంగా కేటాయిస్తే, అందులో ఎనిమిది గెలుచుకుని 80 శాతం ఫలితాలను బీజేపీ సాధించింది.అందులో విశాఖ నార్త్ నుంచి విష్ణు కుమార్ రాజు బీజేపీ నుంచి గెలిచారు. ఆయన 2014లో కూడా గెలిచారు. అప్పుడూ, ఇప్పుడూ కూడా శాసనసభలో బీజేపీ తరపున ఫ్లోర్ లీడర్‌గా వ్యవహరిస్తున్నారు. అయితే ఆయనలో అసంతృప్తి ఉందని అంటారు. సమయం వచ్చిన ప్రతిసారీ దానిని బయటపెట్టుకుంటూనే ఉంటున్నారు.ఇటీవల విశాఖకు బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ వచ్చారు. ఆయన పర్యటన విజయవంతం కావడం కోసం పార్టీ కోఆర్డినేషన్ కమిటీని ఏర్పాటు చేసింది. అందులో విష్ణు కుమార్ రాజు పేరు అయితే లేదు. దాంతో ఆయన అసంతృప్తికి లోనయ్యారు.సీనియర్ నేతలు అంటారు కానీ విలువ లేదని ఆయన మీడియాతోనే అనేశారు. పార్టీలో తమ మాట ఎవరు వింటారని ఆయన వాపోతున్నారు. అంతేకాదు, బీజేపీలో మొదటి నుంచి ఇదే వరస అని కూడా అసహనం వ్యక్తం చేశారు.దీనిపై పార్టీ పెద్దలు అయితే బయటకు మాట్లాడకపోయినా, రాజు గారికి ఇవ్వాల్సిన విలువ, గౌరవం ఇస్తూనే ఉన్నామని చెబుతున్నారు. కోఆర్డినేషన్ కమిటీలో ప్రతి అంశంలో యువ నాయకులకు ప్రాధాన్యత ఇవ్వాలని అధినాయకత్వం ఆదేశించింది కాబట్టే ఎక్కువగా వారికే ప్రాధాన్యత ఇచ్చామని చెబుతున్నారు. అంతే తప్ప మరేమీ కాదని కూడా అంటున్నారు.అయితే రాజు గారి అసంతృప్తి వెనక అసలు విషయాలు వేరేవి ఉన్నాయని కూడా అంటున్నారు. మంత్రి పదవి తనకు దక్కాలని ఆయన బలంగా కోరుకుంటున్నారని ప్రచారం సాగుతోంది. రెండుసార్లు ఎమ్మెల్యేగా బీజేపీలో గెలిచిన వారు ఏపీలో ప్రస్తుతం లేరని కూడా ఆయన ఆలోచనలుగా చెబుతున్నారు. అందువల్ల మంత్రి పదవిని ఆయన ఆశిస్తున్నారని తెలుస్తోంది. కూటమి ప్రభుత్వంలో అది సాధ్యమేనా అన్నది తర్కించుకుంటున్నారు.

### ఏపీలో ఏకంగా 10 వేల పోస్టులు

విజయవాడ, ఏపీ ప్రభుత్వం నిరుద్యోగులకు గుడ్ న్యూస్ చెప్పింది. 2026 జాబ్ క్యాలెండర్ కింద రాష్ట్రంలోని వివిధ ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న 10,060 ఉద్యోగాల భర్తీ ప్రక్రియకు రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ పోస్టులను ఒకేసారి కాకుండా అభ్యర్థుల సౌలభ్యం, పరీక్షల నిర్వహణకు అనుగుణంగా నాలుగు విడతల్లో భర్తీ చేయాలని నిర్ణయించారు.

# సిక్కోలు కార్పోరేషన్ కి మరోసారి షాక్ !

సిక్కోలు:ఏ ముహూర్తాల కార్పోరేషన్ గా శ్రీకాకుళం అవతరించిందో కానీ ఆనాటి నుంచి నేటి దాకా ఎన్నికలు అంటే లేవు. ఇక శ్రీకాకుళం మునిసిపాలిటీకి చివరి సారిగా ఎన్నికలు ఎపుడు జరిగాయంటే 2005 సంవత్సరంలో. అంటే ఉమ్మడి ఏపీలో వైఎస్సార్ ముఖ్యమంత్రిగా ఉండగా అన్న మాట. ఆ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ నేతలే గెలిచి అధికార పీఠం అందుకున్నారు. ఆ తర్వాత కార్పొరేషన్‌గా అప్‌గ్రేడ్ అయినప్పటికీ వివిధ కారణాల వల్ల గత రెండు దశాబ్దాలుగా అక్కడ ఎన్నికలు జరగలేదు. ఎన్నికలు జరగకపోవడానికి కారణాలు సమీప గ్రామ పంచాయతీల విలీనం. రిజర్వేషన్ల వివాదాలు న్యాయపరమైన చిక్కులు ఇతర రాజకీయ కారణాల వల్ల వాయిదా పడుతూ రావడం అని చెబుతున్నారు.

రెండు దశాబ్దాల కాలం :

శ్రీకాకుళం కార్పొరేషన్ కి రెండు దశాబ్దాలుగా ఎన్నికలు జరగకపోవడంతో అధికారుల పాలనలోనే ఉంటోంది. ఎన్నికలు లేకపోవడం వల్ల స్థానికంగా ప్రజా ప్రతినిధులు ఎంతో ఆశగా ఎదురు చూస్తున్నారు. ఎపుడైనా ఎన్నికలు జరగకపోతాయా తాము కార్పోరేటర్లు కాకపోతామా అని వారు భావిస్తున్నారు. ఇక మేయర్ పోస్టు కోసం రాజకీయ నేతల వారసులు టార్గెట్ చేసినా ఫలితం లేకపోతోంది. మారో వైపు అభివృద్ధి విషయంలో అధికారుల మీద ఆధారపడడం మీద కూడా రాజకీయ పార్టీలలో అసహనం పెరుగుతోంది.

మేయర్ కిరీటం కోసం :

ఎన్నికలు అంటూ పెడితే మేయర్ పదవిని అందుకోవాలని చాలా మంది చూస్తున్నారు. గతంలో 2021లో వైసీపీ హయాంలో ఎన్నికలు జరుగుతాయని ఎంతో ఆశించారు. కానీ కోర్టు చిక్కులు అంటూ వాయిదా వేశారు. అప్పట్లో మాజీ మంత్రి ధర్మాన ప్రసాదరావు కుమారుడు మేయర్ సీటుకు పోటీ పడతారు అని ప్రచారం సాగింది. అలాగే టీడీపీ నుంచి కూడా కీలక నేతల వారసులు ఈ వైపుగా చూస్తూ వచ్చారు. ఇపుడు చూస్తే రాష్ట్రంలో స్థానిక ఎన్నికల నగరా మోగింది. కానీ శ్రీకాకుళానికి మాత్రం ఎలాంటి సమాచారం లేదు, దాంతో ఎన్నికలు లేనట్లే అని అంటున్నారు. మిగిలిన చోట్ల ఓటర్ల జాబితాను సిద్ధం చేయమనడం వార్డుల పునర్విభజన వంటి వాటి మీద పై నుంచి ఆదేశాలు వచ్చాయి. ఈ పరిణామంతో శ్రీకాకుళం కార్పొరేషన్ మరో మారు పక్కకు



పోతోంది అన్న ఆవేదన అయితే రాజకీయ జీవులది అయితే ఎన్నికలు పెడితే ఓటేసి ప్రజా ప్రతినిధులను ఎన్నుకుందామని చూస్తున్న జనాలకు కూడా నిరాశ కలుగుతోంది.

కోర్టు చిక్కులు ఎందుకంటే :

శ్రీకాకుళం కార్పోరేషన్ కి ఎన్నికలు పెట్టడానికి కోర్టు చిక్కులు ఉన్నాయని అంటున్నారు. శ్రీకాకుళం మున్సిపల్ కార్పొరేషన్‌కు ఎన్నికలు జరగకపోవడానికి న పంచాయతీల వివాదాలు కారణం అని అంటున్నారు. గతంలో రిజర్వేషన్లపై కోర్టులో దాఖలైన పిటిషన్లు పెండింగులో ఉన్నాయని చెబుతున్నారు. అలాగే ఇతర గతంలో రిజర్వేషన్ల నిబంధనలు పాటించలేదంటూ కూడా పిటిషన్లు దాఖలు అయ్యాయి. విలీన పంచాయతీల అంశాలపై పిల్స్ దాఖలు కావడం కూడా చిక్కులుగా మారింది అని అంటున్నారు. మరో వైపు చూస్తే .పరిపాలనా మార్పులలో భాగంగా శ్రీకాకుళం మున్సిపాలిటీ కార్పొరేషన్‌గా అప్‌గ్రేడ్ అయినప్పటికీ సరిహద్దులు వార్డుల పునర్విభజనపై స్పష్టత రాకపోవడం సైతం పెద్ద సమస్యగా ఉంది. అయితే ఈ తరహా లీగల్ అడ్డంకులను దాటుకుని ఎన్నికలు నిర్వహించాలని ప్రజాప్రతినిధులు ప్రభుత్వానికి విజ్ఞప్తులు చేస్తున్నారు. కానీ ఈసారికి కూడా షాక్ అయితే తప్పదం లేదని అంటున్నారు. మరి శ్రీకాకుళం కార్పోరేషన్ కి ఈ శాపం వీడి ఎపుడు ఎన్నికలు జరుగుతాయని అంటే ఎవరూ చెప్పలేని పరిస్థితి ఉంది.

# ఎన్నికల బరిలో జనసేన...

హైదరాబాద్, ఆగస్టు 24,తెలంగాణలో ఎన్నికలకు జనసేన ముందుగానే సిద్ధమైంది. పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా డాక్టర్ గడల శ్రీనివాసరావును ప్రకటించింది. గతంలో వైద్య, ఆరోగ్యశాఖలో ఉన్నతస్థాయి బాధ్యతలు నిర్వహించిన గడల శ్రీనివాసరావు.. ప్రస్తుతం జనసేన రాష్ట్ర నాయకుడిగా, అధికార ప్రతినిధిగా కొనసాగుతున్నారు. పట్టభద్రులు, ఉద్యోగులు, యువత, విద్యావంతులు, మేధావుల సమస్యలను శాసన మండలిలో బలంగా వినిపిస్తానని ఆయన హామీ ఇచ్చారు.తెలంగాణలో జరిగే ఎన్నికలకు పోటీ చేస్తామని ఇప్పటికే ప్రకటించిన జనసేన పార్టీ అధ్యక్షుడుపవన్ కళ్యాణ్.. ఆ దిశగా ముందస్తుగా అడుగులు వేస్తున్నారు. ఈ నేపథ్యంలోనే త్వరలోనే జరగనున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలపై జనసేన పార్టీ ఫోకస్ పెంచింది. ఎన్నికలకు ఇంకా సమయం ఉండగానే అభ్యర్థిని ప్రకటించి రాజకీయంగా ముందడుగు వేసింది. ఉమ్మడి ఖమ్మం–నల్లగొండ–వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గం నుంచి డాక్టర్ గడల శ్రీనివాసరావును తమ అభ్యర్థిగా జనసేన పార్టీ తాజాగా ప్రకటించింది. జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ ఆమోదంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించింది.వచ్చే ఏడాది మార్చిలో జరగనున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని జనసేన ఇప్పటినుంచే కార్యాచరణ ప్రారంభించినట్లు అర్థమవుతోంది. ఇతర ప్రధాన పార్టీలు అభ్యర్థుల ఎంపికపై కసరత్తు చేస్తున్న సమయంలోనే జనసేన తమ అభ్యర్థిని ప్రకటించడం ఆసక్తిని రేకెత్తిస్తోంది. ముందస్తు ప్రకటనతో ప్రచారం, పట్టభద్ర ఓటర్లతో సంబంధాలు, పార్టీ శ్రేణుల సమన్వయం వంటి అంశాలపై ఎక్కువ సమయం కేటాయించే అవకాశం పార్టీకి లభించనుంది.జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శి రామ్ తాళ్లూరి, తెలంగాణ రాష్ట్ర ఇంచార్జ్ శంకర్ గౌడ్.. డాక్టర్ గడల శ్రీనివాసరావు పేరును పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ దృష్టికి తీసుకెళ్లినట్లు పార్టీ తెలిపింది. ఆయన అభ్యర్థిత్వానికి పవన్ కళ్యాణ్ సుముఖత వ్యక్తం చేయడంతో అధికారికంగా పేరును ప్రకటించినట్లు వెల్లడించింది. డాక్టర్ గడల శ్రీనివాసరావు గతంలో వైద్య, ఆరోగ్యశాఖలో ఉన్నతస్థాయి బాధ్యతలు నిర్వహించారు. తెలంగాణవ్యాప్తంగా వైద్య, ఆరోగ్య రంగంలో సేవలందించిన అనుభవం ఆయనకు ఉంది. ప్రస్తుతం జనసేన రాష్ట్ర నాయకుడిగా, అధికార ప్రతినిధిగా, ఉమ్మడి ఖమ్మం జిల్లా పార్టీ సమన్వయకర్తగా బాధ్యతలను గడల శ్రీనివాసరావు నిర్వహిస్తున్నారు.పట్టభద్రులు, ఉద్యోగులు, యువత, విద్యావంతులు, మేధావులు ఎదుర్కొంటున్న సమస్యలను శాసనమండలి వేదికగా బలంగా వినిపిస్తానని గడల శ్రీనివాసరావు తెలిపారు.



తనను అభ్యర్థిగా ఎంపిక చేసినందుకు పవన్ కళ్యాణ్‌తో పాటు రామ్ తాళ్లూరి, శంకర్ గౌడ్‌కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఉమ్మడి ఖమ్మం, నల్గొండ, వరంగల్ జిల్లాల పరిధిలోని పట్టభద్రులు, ఉద్యోగులు, యువత, ఉన్నత విద్యావంతులు, మేధావుల మద్దతు కూడగట్టడంపై జనసేన పార్టీ దృష్టి పెట్టనుంది. ఈ ఎన్నికల్లో గెలిచి తెలంగాణలో తమ రాజకీయ బలాన్ని మరింత పెంచుకోవాలని పార్టీ లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలుస్తోంది.తనకు పట్టభద్రులు మద్దతు ఇస్తే ఎమ్మెల్సీగా ఎన్నికై ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషి చేస్తానని గడల శ్రీనివాసరావు చెప్పారు. 3 ఉమ్మడి జిల్లాల పట్టభద్రులు తనకు ఆశీస్సులు అందించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఎన్నికలకు ముందుగానే అభ్యర్థిని ప్రకటించిన జనసేన.. ఇక ఓటర్ల నమోదు, క్షేత్రస్థాయి ప్రచారం, పట్టభద్రులతో సమావేశాలు, పార్టీ శ్రేణుల సమన్వయంపై దృష్టి పెట్టే అవకాశం ఉంది. ఈ ఎన్నికల్లో గెలిచి తెలంగాణలో తమ రాజకీయ బలాన్ని మరింత పెంచుకోవాలని పార్టీ లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలుస్తోంది.తనకు పట్టభద్రులు మద్దతు ఇస్తే ఎమ్మెల్సీగా ఎన్నికై ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషి చేస్తానని గడల శ్రీనివాసరావు చెప్పారు. 3 ఉమ్మడి జిల్లాల పట్టభద్రులు తనకు ఆశీస్సులు అందించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఎన్నికలకు ముందుగానే అభ్యర్థిని ప్రకటించిన జనసేన.. ఇక ఓటర్ల నమోదు, క్షేత్రస్థాయి ప్రచారం, పట్టభద్రులతో సమావేశాలు, పార్టీ శ్రేణుల సమన్వయంపై దృష్టి పెట్టే అవకాశం ఉంది. దీంతో ఉమ్మడి ఖమ్మం–నల్గొండ–వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల బరిలో జనసేన ప్రవేశం రాజకీయంగా ఆసక్తికరంగా మారింది.

# సీతక్క మౌనం.. దేనికి సంకేతం ?

హైదరాబాద్,తెలంగాణ రాజకీయాల్లో సీఎం రేవంత్ రెడ్డి ఎన్నడూ లేనంత గడ్డు పరిస్తితులను ఎదుర్కొంటున్నాడు అన్న విషయంలో ఎలాంటి సందేహం లేదు. విపక్షాల విమర్శల సంగతి పక్కన పెడితే సొంత పార్టీలోని మంత్రి కొండా సురేఖ కూతురు సుష్మిత తీవ్రమైన ఆరోపణలు చేసింది. పార్టీ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ప్రభుత్వంలో అన్నిస్థాయిల్లో కోట్లలో అవినీతి జరుగుతుందని ఆరోపించారు. ఇక రేవంత్ రెడ్డి తాను విద్యార్తిగా ఉన్నప్పుడు మాజీ మంత్రి, ప్రస్తుత ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డికి మద్దతుగా గోడల మీద నినాదాలు రాశానని, అతను తన అభిమాన నాయకుడు అని తరచూ చెబుతుంటారు.ఇప్పుడు ఆ చిన్నారెడ్డి కూడా పరోక్షంగా రేవంత్ రెడ్డి మీద ఆరోపణలు చేశారు. '2023 ఎన్నికల్లో సోనియాగాంధీ తనకు పార్టీ తరపున ఎమ్మెల్యే టికెట్ ఇచ్చిందని, నా వద్ద డబ్బులు లేకున్నా రాష్ట్ర కాంగ్రెస్ డబ్బులు ఖర్చు పెట్టి గెలిపించుకు రావాలని ఆదేశాలు ఇచ్చిందని, కానీ తనకు వచ్చిన సీటును ప్రస్తుత వనపర్తి ఎమ్మెల్యే మేఘారెడ్డికి డబ్బులకు అమ్ముకున్నారని ఆరోపించారు. ఈ వ్యవహారం ఇప్పుడు కాంగ్రెస్ అధిష్టానం వరకు వెళ్లింది.రేవంత్ రెడ్డి మీద ఆరోపణల నేపథ్యంలో శుక్రవారం 20 మంది ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ఆయనకు మద్దతుగా మీడియా సమావేశం పెట్టి కొండా సురేఖ, కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి, చిన్నారెడ్డిల మీద చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. 66 మంది ఎమ్మెల్యేలలో రేవంత్ బలం 17 మందేనా అన్న చర్చ రావడంతో శనివారం మరో 5 మంది ఎమ్మెల్యేలు గాంధీభవన్లో సమావేశం పెట్టి రేవంత్ కు మద్దతుగా మాట్లాడారు. కానీ ఒక్క మంత్రి కూడా బహిరంగంగా బయటకు వచ్చి గానీ, అంతర్గతంగా గానీ మాట్లాడిన దాఖలాలు లేవు.వీరందరూ ఒక ఎత్తైతే మంత్రి ధనసరి సీతక్క దీనిపై స్పందించకపోవడం అందరినీ ఆశ్చర్య పరుస్తున్నది. సీతక్క ఆలియాస్ ధనసరి అనసూయ, సీఎం రేవంత్ రెడ్డిలది అన్నాచెల్లెల్ల అనుబంధం. 2004లో టీడీపీలో చేరిన సీతక్క కాంగ్రెస్ అభ్యర్థి పొడెం వీరయ్య చేతిలో ఓడిపోయింది. 2006లో జడ్పీటీసీగా, 2007లో టీడీపీ మద్దతుతో ఎమ్మెల్సీగా రేవంత్ రెడ్డి ఎన్నికయ్యాడు. 2009లో ములుగు నుండి సీతక్క, కొడంగల్ నుండి రేవంత్ రెడ్డిలు మహాకూటమి తరపున పోటీ చేసి ఒకేసారి ఎమ్మెల్యేలుగా ఎన్నికయ్యారు.అప్పటి నుండి వారి మధ్య వ్యక్తగత,



బావోద్వేగ సంబంధాలు ఉన్నాయి. రేవంత్ తనను సోదరి లేదా సీతక్క అని సంబోధిస్తే, సీతక్క నా అన్న అని అంటుంది. 2023లో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే సీతక్కను పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా ఙ శిశు సంక్షేమ శాఖల మంత్రిగా నియమించారు. ప్రతి రాఖీ పండగకు సీతక్క రేవంత్ రెడ్డికి రాఖీ కట్టడం ఆనవాయితీ, రేవంత్ భార్య గీత సీతక్కకు బహుమతులు ఇవ్వడం, సీతక్క రేవంత్ రెడ్డి సతీమణికి చీరపెట్టడం, రేవంత్ రెడ్డి మనవడు రుద్రదేవ్ కు బహుమతులు ఇచ్చిన విషయం అందరికీ తెలిసిందే.వీరిద్దరి మధ్య ఇంత అనుబంధం ఉన్నా కొండా సురేఖ కూతురు ఆరోపణల సమయంలో సీతక్క ఎందుకు స్పందించడం లేదన్న అనుమానాలు తలెత్తుతున్నాయి. కొంతకాలం నుండి రేవంత్ రెడ్డి, సీతక్కల మధ్య సంబంధాలు దెబ్బతిన్నాయని, మీడియా ప్రతినిదులతో ప్రైవేటు సంభాషణల్లో సీతక్క వ్యవహారశైలి మీద రేవంత్ రెడ్డి అసహనం వ్యక్తం చేశాడన్న వార్తలు బయటకు పొక్కాయి. దాంతో పాటు సీతక్క ప్రత్యేకంగా పలుమార్లు ఢిల్లీకి వెళ్లి కాంగ్రెస్ అధిష్టానం పెద్దలతో అపాయింట్ మెంట్ తీసుకుని వెళ్లి కలిసిందన్న సమాచారం ఉంది. ఈ మేరకు అధిష్టానం ఆదేశాల మేరకే స్పందించాలని సీతక్క భావిస్తున్నట్లు ప్రచారం జరుగుతుంది. మరి త్వరలోనే రాఖీ పౌర్ణమి ఉన్న నేపథ్యంలో రేవంత్ రెడ్డి – సీతక్కల మధ్య సంబంధాలు ఎలా ఉన్నాయి అన్న విషయంలో అందరికీ ఒక క్లారిటీ వస్తుందని భావించవచ్చు.

# స్టీల్‌ప్లాంట్‌లో యంత్రాలకు మరమ్మతులు తప్పనిసరి



విశాఖపట్నం: విశాఖ స్టీల్ ప్లాంట్‌లోని యంత్రాల మరమ్మతులకు కేంద్ర స్టీల్ మంత్రి ప్రకటించిన రూ. 8 వేల కోట్లను తక్షణం విడుదల చేసి స్టీల్ ప్లాంట్ ఉద్యోగుల, కార్మికుల ప్రాణాలు కాపాడాలని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఛైర్మన్‌లు సీహెచ్ నర్సింగరావు, డి ఆదినారాయణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. 1970 రోజులుగా జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద జరుగుతున్న విశాఖ ఉక్కు పరిరక్షణ ఉద్యమ దీక్షా శిబిరంలో విశాఖ ఉక్కు అఖిలపక్ష కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ఆదివారం ధర్నా నిర్వహించారు. ధర్నాకు అధ్యక్షత వహించిన స్టీల్ సీఐటీయూ ప్రధాన కార్యదర్శి జె. అయోధ్య రామ్ మాట్లాడుతూ స్టీల్ ప్లాంట్‌లో యంత్రాల మరమ్మత్తు, కార్మికుల సంఖ్య గణనీయంగా తగ్గడం వల్ల ఆ ప్రభావం పూర్తిస్థాయి ఉత్పత్తి సాధించడానికి అవరోధంగా ఉందని వివరించారు. యంత్రాల మరమ్మతు, కార్మికుల సంఖ్య పెంచడం వంటివి ప్రభుత్వ యాజమాన్యాల ఆదేశాలతోనే జరుగుతాయని, చర్యలు తక్షణమే చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. జేఏసీ ఛైర్మన్లు సీహెచ్ నర్సింగరావు, డి ఆదినారాయణ మాట్లాడుతూ.. ప్రభుత్వం రాజ్యాంగపరంగా కల్పించిన వాక్ స్వాతంత్ర్య హక్కును నేడు స్టీల్ యాజమాన్యం, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అణచివేయాలనుకోవడం అత్యంత దుర్మార్గమన్నారు. అందులో భాగంగానే ఆగస్టు 10న మీడియాతో, సామాజిక మాధ్యమాలలో స్టీల్ ప్లాంట్‌పై మాట్లాడటం, ప్రశ్నించడంపై తగిన చర్యలు తీసుకుంటామని స్టీల్ యాజమాన్యం ఒక సర్క్యులర్‌ను విడుదల చేసిందన్నారు. ఇప్పటికే దేశంలో ఎక్కడా లేనివిధంగా ఉత్పత్తి ఆధారంగా పర్సంటేజ్ వేతనాలను కార్మికులకు గడచిన 18 మాసాలుగా చెల్లిస్తూ, హెచ్‌ఆర్‌ఏ నిలుపుదల చేశారన్నారు. కరెంట్ ఛార్జీల పెంపు, వీఆర్ఎస్ పేరుతో ఉద్యోగులను తొలగించి వారిని ఆర్థికంగా మానసిక ఒత్తిడికి గురి చేస్తూ ఇలా రూ. 900 కోట్లను బకాయి పడిన యాజమాన్యాన్ని ప్రశ్నించకూడదనడం ఎంతవరకు న్యాయమని వారు అన్నారు. అలాగే కేంద్ర హోం మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో ఉన్న సీఐఎస్ఎఫ్ ద్వారా గడచిన నాలుగు దశాబ్దాలుగా స్టీల్ ప్లాంట్‌లో ఆస్తుల రక్షణ, అగ్ని ప్రమాదాల బారి నుంచి యంత్రాలు, కార్మికుల ప్రాణాలను కాపాడుతుందన్నారు. ఆ వ్యవస్థను పూర్తిగా తొలగిస్తూ నేడు ఆదేశాలను ఇచ్చారని వారు ఈ సందర్భంగా గుర్తు చేశారు. విశాఖ స్టీల్ ప్లాంట్‌ను పూర్తిగా ప్రైవేటు వారికి కట్ట పెట్టాలన్న ప్రభుత్వ ఆలోచనకు ముందడుగు అని తెలిపారు. ప్రభుత్వ యాజమాన్యాల వైఖరికి వ్యతిరేకంగా ప్రజలను సమీకరించి స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున పోరాటాల ద్వారా ఉద్యమిస్తామని హెచ్చరించారు. జిల్లా అఖిలపక్ష కార్మిక సంఘాల ప్రతినిధులు ఆర్ కె వి ఎస్ కుమార్, బి నాగభూషణం, పడాల రమణ, పి వి సురేష్, ఎన్ రామారావు మాట్లాడుతూ ఉత్తరాంధ్ర అభివృద్ధి అంటే స్టీల్ ప్లాంట్ రక్షణ తోనే సాధ్యమవుతుందని, కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రైవేటీకరణ విధానాలను రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం సమర్థించడం రాష్ట్ర ప్రజల అభిమతానికి విరుద్ధమని అన్నారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం కేంద్రంపై ఒత్తిడి చేసి విశాఖ స్టీల్ ప్లాంట్ ను రక్షించాలని

# ఖర్గే వద్దకు కొండా .. సీన్ లోకి కేవీపీ



న్యూఢిల్లీ,తెలంగాణలో సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి కొండా సురేఖల మధ్య నెలకొన్న వివాదం రోజురోజుకూ మలుపులు తిరుగుతుంది. వివాదం చెలరేగి ఐదు రోజులు దాటినా కాంగ్రెస్ అధిష్ఠానం నుంచి ఎలాంటి స్పందన కనిపించకపోవడంతో సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. అదే సమయంలో కొండా సురేఖ భర్త కొండా మురళి ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్కతో భేటీ అయ్యేందుకు ప్రయత్నించగా ఆయన అపాయింట్మెంట్ ఇవ్వలేదన్న విషయం బయటకు పొక్కింది. అదే సమయంలో బెంగళూరులో కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేతో మంత్రి కొండా సురేఖ గంటపాటు భేటీ అయ్యారన్న విషయం బయటకు వచ్చింది. మరోవైపు కొండా సురేఖ తరపున కాంగ్రెస్ అధిష్ఠానంతో కాంగ్రెస్ సీనియర్ నేత కేవీపీ రామచంద్ర రావు చక్రం తిప్పుతున్నారు అన్న ప్రచారం ఆసక్తికరంగా మారింది.కొండా సురేఖ వివాదం, కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ఆరోపణలకు ముందే కాంగ్రెస్ అధిష్టానంతో రేవంత్ రెడ్డికి దూరం పెరిగిందన్న ప్రచారం ఉంది. కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలు, ఆలోచనలకు భిన్నంగా రాష్ట్రంలో రేవంత్ రెడ్డి పాలన, వ్యవహారశైలి నడుస్తోంది అన్న వారు ఉన్నారు. మోడీకి, బీజేపీకి అనుకూల వైఖరి అవలంబిస్తున్నారు అన్న ఆరోపణలు ఉన్నాయి. సెంట్రల్ మినిస్టర్ కుమారుడి మీద పోక్సో కేసు, తాజాగా ఎంపీ కుమారుడు యాక్సిడెంట్ కేసులో తెలంగాణ పోలీసుల వైఖరి జాతీయస్థాయిలో వివాదాస్పదమైంది. జాతీయ మీడియా దీనిని తీవ్రంగా తప్పుపడుతుంది. మరో వైపు సర్ కార్యక్రమంలో భాగంగా ఓట్ల నమోదు, నియోజకవర్గాల పునర్విభజన విషయంలో కాంగ్రెస్ అధిష్టానం వైఖరికి భిన్నంగా రేవంత్ రెడ్డి అభిప్రాయం వ్యక్తం చేయడం చర్చనీయాంశంగా మారింది.ఈ నేపథ్యంలోనే కొండా సురేఖ వివాదం మొదలయింది. రేవంత్ రెడ్డి మంత్రి వర్గంలోని మంత్రి కూతురు నేరుగా సీఎం మీద ఆరోపణలు చేసినా ఎలాంటి చర్యలు తీసుకోలేని నిస్సహాయ స్థితిలో రేవంత్ రెడ్డి ఉండడం ఆయన సంధిగ్ధ పరిస్థితిని తెలియజేస్తుంది. రేవంత్ రెడ్డి తరపున దాదాపు 25 మంది ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఇరువురు మంత్రులు ఈ వివాదంపై తమ అభిప్రాయాలను వ్యక్తం చేసి, చర్యలకు డిమాండ్ చేసినా ఎలాంటి స్పందన లేకపోవడంతో అసలు అధిష్టానం ఆలోచన ఏమిటన్నది ఎవరికీ అంతుచిక్కడం లేదు.కొండా సురేఖ కూతురు వ్యాఖ్యల నేపథ్యంలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కతో కొండా మురళి భేటీకి ప్రయత్నించగా ఆయన తిరస్కరించారని తెలుస్తోంది. ఇలాంటి పరిస్థితుల్లో కొండా సురేఖ నేరుగా బెంగళూరులో కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేతో భేటీ అయ్యారన్న ప్రచారం ఆసక్తికరంగా మారింది. పార్టీ క్రమశిక్షణ కమిటీకి తన సమాధానం ఇచ్చిన కొండా సురేఖ పార్టీ ప్రజాప్రతినిధులు, నేతలు తనను, తన కుటుంబ సభ్యులను లక్ష్యంగా చేసుకుని అసభ్యంగా చేస్తున్న ప్రచారంపై చర్యలు తీసుకోవాలని క్రమశిక్షణ కమిటీకి లేఖ రాసింది. బీసీ సామాజికవర్గానికి చెందిన బలమైన నేతనైన తన మీద జరుగుతున్న ప్రచారం వెనక ఎవరున్నారో గుర్తించి చర్యలు తీసుకోవాలని కోరింది.ఇది ఇలా ఉంటే కొండా సురేఖ తరపున ఢిల్లీలో పార్టీ సీనియర్ నేత, మాజీ రాజ్యసభ సభ్యుడు కేవీపీ రామచంద్ర రావు చక్రం తిప్పుతున్నారన్న ప్రచారం ఉత్కంఠ రేపుతున్నది. వైఎస్ ఆత్మగా పేరున్న కేవీపీతో కొండా దంపతులకు సన్నిహిత సంబంధాలు ఉన్నాయి. అధికారంలోకి వచ్చిన కొత్తలో అధిష్టానంతో కొన్ని పనులకు సీఎం రేవంత్ రెడ్డి కేవీపీ సహాయం తీసుకున్నారని ప్రచారం ఉంది. ఆ తర్వాత వారి మధ్య సంబంధాలు దెబ్బతిన్నట్లు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో కొండా వివాదంలో కేవీపీ చక్రం తిప్పడం ఆసక్తికర అంశం.మరి మల్లిఖార్జున ఖర్గేతో భేటీలో కొండా సురేఖ ఏం చర్చించారు ? ఢిల్లీ లో కేవీపీ అధిష్టానంతో ఏం చక్రం తిప్పుతున్నారు ? లండన్ నుండి వచ్చిన సీఎం రేవంత్ రెడ్డి ఈ వివాదంపై ఎలా స్పందిస్తారు ? మొత్తంగా అధిష్ఠానం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుంది? అన్నది వేచిచూడాలి.

Edited, Printed, Published & owned by KOTAGIRI CHANDRA SHEKAR, Published From, H.NO.5-7-163 PRAKASHAM BAZAR, NALGONDA TOWN, TELANGANA- 508 001, Printed at KOTAGIRI GRAPHICS & KOTAGIRI OFFSET PRINTER, H.NO.5-7-163 PRAKASHAM BAZAR, NALGONDA TOWN, TELANGANA- 508 001. Editor: KOTAGIRI CHANDRA SHEKAR, RNINo. TELTEL/2022/86880, Cell:9440164140